# మనం
## కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల-పెద్దపల్లి-ఆసిఫాబాద్-మంచిర్యాల

మంగళవారం | 14 | ఏప్రిల్ | 2026 | పేజీలు 16 | www.manamepaper.com




డంపింగ్‌యార్డ్‌పై గ్రామసభ పెట్టండి 2లో..

### కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా

# ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

**మంథని ఏఎంసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం**

**ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్ళు చేపట్టాలని ఐటి,పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుఅన్నారు.సోమవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి., మంథని ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మంథని ఏఎంసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐటి, పరిశ్రమలు,శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శాసన సభ్యులు విజయరమణ రావు, ఠాకూర్ మక్కా సింగ్, ఏ ఎంసీ చైర్మన్ కుదుదుల వెంకన్న పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.

**మంథని ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** ఈ సందర్భంగా ఐటి, పరిశ్రమలు,శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగుల సమస్య తలెత్తకుండా చూడాలని జిల్లా అధికారులను ఆదేశించారు.తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు.రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని అన్నారు.

- మిగతా 2లో..



## రోడ్డు భద్రతపై 'అరైవ్ అలైవ్'
# ప్రాణాలను నిర్లక్ష్యం చేయకండి



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా, కరీంనగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ మరియు రవాణా శాఖల సమన్వయంతో తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలో అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.

**మానకొండూరు, ఏప్రిల్ 13(మనం న్యూస్) :** ఈ కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరుకాగా, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు పేద, ధనిక అనే తేడా లేకుండా అందరినీ దెబ్బతీస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, తాగి వాహనాలు..

- మిగతా 2లో..

# డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలి

కరీంనగర్ ఏప్రిల్ 13(మనం న్యూస్) : నేడు మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరగనున్న స్వర్గీయ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. సోమవారం రాత్రి కరీంనగర్ కోర్టు చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద జయంతి సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. అంబేద్కర్ జయంతి వేడుకలకు హాజరయ్యే ప్రజలు వివిధ సంఘాల నేతలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. వేసవి కాలం నేపథ్యంలో అందుకు అనుగుణంగా వసతులు..



- మిగతా 2లో..

## కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

మొదటి పేజీ తరువాయి

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్,వైస్ చైర్మన్ ముక్కుల సహేంద ర్ రెడ్డి,టీజీఈ ఆర్సీ సలహాదారు శశిభూషణ్ కాచే,ఆర్ టి ఐ మెంబర్ మంథని సురేష్,ఏఎంసి వైస్ చైర్మన్ ప్రశాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్,మాజీ సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్,అనంత రెడ్డి, మాజీ ఎంపీపీ కొండ శంకర్,మాజీ ఏ ఎంసీ చైర్మన్ ఆకుల కిరణ్, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ పెండ్లి రమ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, డీఎంశ్రీకాంత్,డిసి ఎస్ ఓ,సంఘ అఫిషియల్ పర్సన్ ఇంచార్జి అనిల్ కుమార్,ఏడిఏ అంజనీ మిశ్రా,ఏవో నవ్య,ఏఎం సి కార్యదర్శి సతీష్, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్,మున్సిపల్ కౌన్సిలర్లు,ఏఎంసీ డైరెక్టర్లు,సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్‌యార్డ్ పై ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు గ్రామసభ పెట్టండి

**- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

హుజురాబాద్, ఏప్రిల్ 13 (మనం న్యూస్): డంపింగ్ యార్డ్ పై ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు గ్రామసభ పెట్టాలని,డంపింగ్ యార్డ్ ఏర్పాటు ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించమని, అఖిలపక్షంతో భారీ ఆందోళనలు చేపడతామని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. హుజురాబాద్ పట్టణంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరాహార దీక్ష శిబిరాన్ని సోమవారం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సందర్శించి దీక్షకు మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ప్రజలు 22 రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ కోసం సుమారు 500 ఎకరాల భూమి సేకరించినట్లు సమాచారం ఉందని, వెంటనే ఈ ప్రాంతం నుంచి డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుడా చైర్మన్ హుజురాబాద్ ప్రజలు డంపింగ్ యార్డ్ కావాలని కోరుకుంటున్నారని చెబుతున్నారని, నిజంగా ప్రజలు కోరుకుంటున్నారో లేదో తెలుసుకోవాలంటే గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజల అభిప్రాయం తెలుసుకోవాలని అన్నారు. గ్రామ సభలో ప్రజలే వాస్తవ పరిస్థితిని వెల్లడిస్తారని, ప్రజలే మీకు బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోకపోతే జేఏసీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. డంపింగ్ యార్డ్ వల్ల 9 మండలాల ప్రజల ఆరోగ్యం, పర్యావరణంపై తీవ్ర ప్రభావం ఉంటుందని పేర్కొంటూ, ఆ మండలాల ప్రజలందరిని ఏకం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. అఖిలపక్షం ఏర్పాటు అనంతరం లక్ష మందితో భారీ ధర్నా నిర్వహిస్తామని, ఈ ప్రాంతం నుంచి డంపింగ్ యార్డ్ తొలగించే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. మా ప్రభుత్వం లేదా మా పాలకవర్గం ఉన్నప్పుడు ఈ ప్రతిపాదనకు అంగీకరించి సంతకం చేసినట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధం అని సవాల్ విసిరారు. లేనిపక్షంలో తమ పై ఆరోపణలు చేస్తున్న వారు తమ పదవులకు రాజీనామా చేసి హుజురాబాద్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి అని డిమాండ్ చేశారు. ఈ నెల 19న డంపింగ్ యార్డ్ ప్రాంతంలో నిర్వహించనున్న మల్లన్న పట్నాలు కార్యక్రమానికి ప్రజలు భారీ ఎత్తున పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలి

మొదటి పేజీ తరువాయి




కల్పించాలని ఆదేశించారు. అంబేద్కర్ జయంతి వేడుకలు కనీవినీ ఎరుగని రీతిలో ఘనంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, ఎస్సీ, బీసీ, ఎస్టీ సంఘ నాయకులు, అన్ని వర్గాల ప్రజలందరూ పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ కే మహేశ్వర్ ఇన్చార్జి ఎస్సీ కార్పొరేషన్ ఈడి తిరుపతిరావు కరీంనగర్ అర్బన్ తహసిల్దార్ నరేందర్ తో పాటు పలువురు అధికారులు దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రహదారి భద్రత నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేమసాగర్ రావు**

హాజీపూర్ ఏప్రిల్ 13,(మనం న్యూస్): వాహనదారులు రహదారి భద్రత నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ప్రేమ్ సాగర్ రావు లు అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లాలోని హాజీపూర్ మండలం రాపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అరవై అలైవ్ కార్యక్రమానికి డిసిపి ఏ.భాస్కర్, మంచిర్యాల ఏ సి పి ప్రకాష్, జిల్లా రవాణా అధికారి, హాజీపూర్ మండల తహసిల్దార్ పుష్పలత లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నిబంధనలను పాటించాలని, ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అరైవ్ - అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ప్రతి వాహనదారుడు రహదారి భద్రత నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. ఈ క్రమంలో రహదారులపై కేజ్ వీల్స్ నడపకూడదని, నిబంధనలు ఉల్లంఘించి రహదారులకు దెబ్బతినేలా వాహనాలు నడిపినట్లైతే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి వాహనానికి సంబంధించి ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, వాహనదారులు మద్యం సేవించి, మొబైల్ వినియోగిస్తూ వాహనాలు నడపకూడదని తెలిపారు. తనిఖీలలో మద్యం సేవించి వాహనం నడుపుతూ దొరికినట్లైతే సంబంధిత వాహనదారుడి లైసెన్స్ సస్పెండ్ చేయడం జరుగుతుందని, 18 సంవత్సరాల వయస్సు నిండని వారు వాహనాలు నడపకూడదని, ఒకవేళ నడిపినట్లయితే వారి తల్లితండ్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జాతీయ రహదారులపై పరిమిత వేగాన్ని పాటించాలని, రవాణా వాహనాలు పరిమిత లోడ్ రవాణా చేయాలని తెలిపారు. పోలీస్, రవాణా శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నప్పటికీ ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వామ్యులై వాహనాలను నిబంధనలకు లోబడి జాగ్రత్తగా నడపాలని తెలిపారు. అతివేగం చాలా ప్రమాదమని, అనుభవానికి ప్రమాదానికి సంబంధం లేదని, వేగం పరిమితిలో ఉండి నిబంధనలు పాటించినట్లయితే గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవచ్చని తెలిపారు.మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా, సక్రమంగా హెల్మెట్ ధరించాలని, ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు, కారులో ప్రయాణించేవారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. పరిమితికి మించి వాహనాలలో ప్రయాణికులను రవాణా చేయకూడదని, వాహనాలు నడిపే సమయంలో ఎట్టి పరిస్థితులలో మొబైల్ వినియోగించకూడదని, మద్యం సేవించి వాహనం నడపకూడదని తెలిపారు. వాహనం నడిపే సమయంలో మనం పాటించే చిన్న చిన్న విషయాలే మన ప్రాణాలను కాపాడతాయని తెలిపారు. గ్రామ సభలలో రహదారి భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామంలో వాహనాల వేగాన్ని నియంత్రించేలా ప్రమాద ప్రాంతాలను గుర్తించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. గ్రామాలలోని అంతర్గత రహదారులపై వాహనదారులకు ఇబ్బందులు లేకుండా పారిశుధ్య నిర్వహణలో భాగంగా రహదారులను శుభ్రంగా ఉంచేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాల పంపిణీ చేశారు.



## రోడ్డు భద్రతపై 'అరైవ్ అలైవ్'.. ప్రాణాలను నిర్లక్ష్యం చేయకండి

మొదటి పేజీ తరువాయి

నడపడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. "డ్రంకన్ డ్రైవ్‌లో ఎవరైనా పట్టుబడితే రికమండేషన్ కోసం నాకు ఫోన్ చేయవద్దు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది" అని ఆయన స్పష్టం చేశారు. ప్రతి కుటుంబం క్షేమంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

### గ్రామసభల్లో భద్రతపై చర్చించాలి

జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల వల్ల ఛిన్నాభిన్నమైన కుటుంబాల గాథలు వింటే మనసు కలచివేస్తోందని అన్నారు. సర్పంచులు తమ గ్రామసభల్లో రోడ్డు భద్రతపై ప్రత్యేకంగా చర్చించాలని, స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్ వంటి ఏర్పాట్లపై శ్రద్ధ వహించాలని సూచించారు.

### హెల్మెట్ ధరించడం తప్పనిసరి

సిపి గౌష్ ఆలం మాట్లాడుతూ, జిల్లాలో గతేడాది 200 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారని, అందులో ద్విచక్ర వాహనదారులే ఎక్కువని తెలిపారు. ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకపోవడం మరణాలకు ప్రధాన కారణాలన్నారు. పోలీసుల చర్యల వల్ల ప్రమాదాల రేటు 17 శాతం తగ్గిందని, ప్రమాదం జరిగిన 'గోల్డెన్ అవర్'లో బాధితులను ఆసుపత్రికి చేర్చిన వారికి ప్రభుత్వం రూ. 25 వేల బహుమతి ఇస్తుందని తెలిపారు. 'రహ వీర్' పథకం కింద ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో రూ. 1.5 లక్షల వరకు ఉచిత నగదు రహిత చికిత్స అందుబాటులో ఉందని వివరించారు.

### కన్నీళ్లు పెట్టించిన బాధితుల గాథలు

ఈ కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాల్లో తమ కుటుంబ పెద్దలను కోల్పోయిన బాధితులు స్టేజీపై తమ ఆవేదనను పంచుకున్నారు. వారి మాటలు సభికులను కంటతడి పెట్టించాయి. గ్రామ సర్పంచ్ శ్వేత మాట్లాడుతూ, తమ గ్రామాన్ని ఈ కార్యక్రమానికి ఎంచుకున్నందుకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసుశాఖ తరుపున, ఎమ్మెల్యే చేతులమీదుగా పలువురికి హెల్మెట్లను అందజేశారు. అంతేకాకుండా స్థానికులకు, డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులచే రోడ్డు నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేపించారు. అరైవ్ - అలైవ్ కార్యక్రమ గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, రవాణా, పోలీసు శాఖల అధికారులు, సర్పంచులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# భద్రంగా.. సామాజిక బాధ్యతగా రోడ్డుపై వెళ్లాలి

## - ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్




రాజన్న సిరిసిల్ల ,ఏప్రిల్ -13(మనం ప్రతినిధి ):రోడ్డుపై వెళ్లే ప్రతి వాహనదారుడు భద్రంగా.. సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ వెళ్లాలని ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా పోలీస్ శాఖ,రవాణా శాఖ ఆద్వర్యంలో ఈ నెల 13వ తేదీ నుంచి18వ తేదీ నుంచి వారోత్సవాల సందర్భంగా మొదటి రోజు పోలీసుల ఆధ్వర్యంలో కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలో సోమవారం అరైవ్.. అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించగా,హా ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు.ముందుగా అరైవ్.. అలైవ్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,డీజీపీ శివధర్ రెడ్డి వీడియో సందేశం వినిపించారు. రోడ్డు ప్రమాదాలతో ఓ కుటుంబం పడుతున్న ఇబ్బందుల ఆధారంగా రూపొందించిన సందేశం వీడియో ఆలోచింపజేసింది. గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేసి.. గ్రామ-స్తులతో అరైవ్.. అలైవ్ పై ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ..ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా పోలీస్ శాఖ ఆద్వర్యంలో అరైవ్.. అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,డీజీపీ శివధర్ రెడ్డి సందేశం ప్రకారం యుద్ధాలు,వ్యాధుల ఇతర కారణాలతో ఎక్కువ మరణాలు జరగడం లేదని,రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది మృతి చెందుతున్నారని వెల్లడించారు. ప్రతి వాహనదారుడు సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలని,కార్లలో తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని,మేజర్లకే జాగ్రత్తలు చెపుతూ వాహనాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్రంలో ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి,సంక్షేమ పనులు ప్రజల్లోకి తీసుకువెళ్లడం,భవిష్యత్ ప్రణాళికలు రచించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో పారిశుధ్య పనులు,రెసిడెన్షియల్ విద్యార్థులు,ప్రజలకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేయించామని,అవగాహన కార్యక్రమాలుర్యాలీలు నిర్వహించామని వెల్లడించారు. రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు వీధిన పడుతున్నాయని,ప్రతి వాహనదారుడు ఇంటి నుంచి వెళ్లింది మొదలు ఇంటికి వచ్చే వరకూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పిలుపు నిచ్చారు. ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి.. సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారుదేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి,సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి గంజాయి,డ్రగ్స్ నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.గంజాయి,డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నారని వివరించారు. సిరిసిల్ల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇటీవల డీ అడిక్షన్,కౌన్సెలింగ్ కేంద్రం ప్రారంభించామని తెలిపారు.యు-వత,విద్యార్థులు ఆటలు ఆడాలని.. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనే సీఎం కప్ పేరిట40విభాగాల్లో పోటీలు నిర్వహించామని గుర్తుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు300కోట్ల జీరో టికెట్లపై ప్రయాణం చేసి.. రూ.10వేల కోట్లు ఆదా చేశారని తెలిపారు. రైతును రాజుగా చేయడమే లక్ష్యంగా వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని,రూ.2లక్షల లోపు రుణ మాఫీ చేశామని గుర్తు చేశారు.ఇండ్లకు200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని,వేములవాడ నియోజకవర్గంలో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ లో భాగంగా వివిధ నీటి పారుదల ప్రాజెక్ట్ ల పనులు కొనసాగుతున్నాయని,మల్కపేట ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా చేశామని తెలిపారు. నూతన రేషన్ కార్డులు ఇస్తున్నామని,నూతన కుటుంబ సభ్యుల పేర్లు నమోదు అవుతున్నాయని వెల్లడించారు. రేషన్ కార్డ్ లు ఉన్న అందరికీ సన్న బియ్యం ఇస్తున్నామని,రాష్ట్రంలో86శాతం మందికి పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు.

### రాష్ట్రంలో మొదటి స్థానం

రాష్ట్రంలో ఆంజనేయ స్వామి గుడి లేని ఊరు ఉండదని.. ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు ఉండదని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక ప్రణాళిక.. ఆచరణ కార్యక్రమాలతో రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయిన జాబితాలోజిల్లా మొదటి స్థానంలో ఉందని కొనియాడారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. నిజామాబాద్ గ్రామంలో 44 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని,లబ్ధిదారులకు రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయం ఇస్తున్నామని వెల్లడించారు. త్వరలో ఇందిరా ఆత్మీయ భరోసా.. బీమా పథకం అమలు చేయనున్నామని పేర్కొన్నారు. వృద్ధుల సంక్షేమానికి చట్టం తీసుకువచ్చామని,త్వరలో కొత్త పెన్షన్లు ఇస్తామని చెప్పారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి మార్చి6వ తేదీన ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారుఇందులో భాగంగా జూన్12వ తేదీ వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు,మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు,చెత్తాచెదారం తొలగింపు పనులు చేయించామని వివరించారు.వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు,ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని వెల్లడించారు. ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్షలు,సేవలు అందించామని తెలిపారు.

టీబీ ముక్త్ భారత్ లో భాగంగా జిల్లాకు వచ్చిన మొబైల్ ఎక్స్ రే యంత్రం ప్రారంభించామని,నిర్దేశిత గ్రామాల్లో పరీక్షలు చేస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో గత ఏడాది4,80,000ప్రమాదాలు జరిగాయని,దానిలో1,70,000మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రతి డ్రైవర్ రోజు వాహన భద్రత ప్రతిజ్ఞ చేసి ఇంటి నుంచి బయటకు వెళ్ళాలని సూచించారు. తమ కుటుంబ,పిల్లల బాద్యతను గుర్తు పెట్టుకొని జాగ్రతగా వెళ్లాలని పేర్కొన్నారు.అందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనాలు నడపాలని పిలుపునిచ్చారు. ప్రతి నెలా రోడ్డు సేఫ్టీ కమిటి మీటింగ్ ఆర్అండ్ బీ,పీఆర్,పోలీస్,రవాణా శాఖా,ఆర్టీసీ అధికారులతో సమావేశం పెడుతున్నామని,బ్లాక్ స్పాట్స్ గుర్తింపు,నివారణ చర్యలు,సైన్ బోర్డ్స్ ఏర్పాటు తదితర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు పూర్తిగా తగ్గించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వాహనం ఎక్కినప్పటి నుంచి కింద దిగే వరకూ సెల్ ఫోన్ వినియోగించవద్దని వాహనదారులకు సూచించారు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకు వెళ్లి వైద్య సహాయం అందించే వారికి ప్రభుత్వం రహవీర్ కింద రూ.25వేల సహాయాన్ని అందిస్తుందని,రోడ్డు ప్రమాద బాదితులను ఆసుపత్రిలో వైద్యం పొందే సదుపాయం ఉందని వెల్లడించారు. స్కూల్ ఆటోలు,బస్సులలో పరిమితికి మించి విద్యార్థులను తరలించవద్దని స్పష్టం చేశారు.ద్విచక్ర వాహనదారులు ఎక్కువ సంఖ్యలో రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారని వెల్లడించారు. నో హెల్మెట్.. నో ఎంట్రీ కార్యక్రమాన్ని గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారుఅందరి రక్షణ కోసం ఈ చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం అవుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు,మరణాలు తగ్గించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులు తమ తండ్రికి హెల్మెట్ ఉపయోగం చెప్పాలని పేర్కొన్నారు.

### రోడ్ సేఫ్టీ.. లైఫ్ సేఫ్టీ

రోడ్ సేఫ్టీ.. లైఫ్ సేఫ్టీ అని ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు.ఎక్కువ ప్రమాదాలు డ్రంక్ అండ్ డ్రైవ్ తోనే అవుతున్నాయని తెలిపారు. జనవరి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అలాగే జిల్లాలో రోడ్ సేఫ్టీ,ట్రాఫిక్ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. వాకథన్,డ్రైవర్లకు కంటి పరీక్షలు ఇతర కార్యక్రమాలు చేపట్టామని వెల్లడించారు. ఈ వారంలో పోలీస్ శాఖ తరఫున వివిధ కార్యక్రమాలు చేస్తామని వివరించారు. గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీ ఎక్కడైనా రోడ్లపై ఇబ్బందులు,గుంతలు,వీధి దీపాల సమస్య,రోడ్డు వెంట బావులపై నివేదిక పంపాలని సూచించారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్,కార్ వాహనదారులు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని,సైకిల్ నడిపే పిల్లలు దానికి వాడే హెల్మెట్ వినియోగించాలని తెలిపారు. మైనర్లు వాహనాలు నడపవద్దని ఒకవేళ నడిపి పట్టుబడితే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అసలు ప్రమాదాలే జరవద్దని ఆకాంక్షించారు. త్రిబుల్ రైడింగ్,రాంగ్ రూట్ డ్రైవ్ చేయవద్దని సూచించారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య,వైస్ ఛైర్మన్ తాళ్ళపల్లి ప్రభాకర్,గ్రామ సర్పంచ్ శ్రీహరి,సర్పంచులు ఫోరం మండలాధ్యక్షుడు బోయిని దేవరాజ్,వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు,తహసీల్దార్ వరలక్ష్మి,ఎంపీడీఓ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికుల సమ్మె పట్ల మంత్రి జోక్యం చేసుకోవాలి



విద్యుత్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కొరకు రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న సమ్మె ఆరవ రోజుకు చేరుకుంది. ఈరోజు సిఐటియు పెద్దపెల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు సమ్మె శిబిరాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వాన్ని గొంతెమ్మ కోరికలు కోరడం లేదని కనీస డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నారని అన్నారు.వీరి సమ్మె పట్ల రాష్ట్ర ఐటి మంత్రి శ్రీధర్ బాబు జోక్యం చేసుకొని యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరిపి సమ్మెను విరమింప చేయాలని కోరారు.అలాగే విద్యుత్ పర్మనెంట్ ఉద్యోగులు సమ్మెకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం నుండి స్పందన రాకపోతే దశల వారి ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఏలుపుల సురేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గొర్రెంకల సురేష్,విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు

# ఇందారంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక



జైపూర్, ఏప్రిల్ :13 (మనం న్యూస్): జైపూర్ మండలం ఇందారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా సోమవారం రెండు కీలక కార్యక్రమాలను నిర్వహించినట్లు సర్పంచ్ ఎండి. ఫయాజుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటగా "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన సభను నిర్వహించి, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు దిశానిర్దేశం చేశామన్నారు. అలాగే రోడ్డు భద్రతను పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక కమిటీని నియమించినట్లు పేర్కొన్నారు. అనంతరం, "ఇంటింటి పోషణ సంబరాలు" కార్యక్రమంలో భాగంగా మహిళలు, పిల్లల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై నిర్వాహకులు అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. ఇదే క్రమంలో, నూతనంగా బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి ర్యాంకర్లకు ఘన సన్మానం



జైపూర్, ఏప్రిల్ :13 (మనం న్యూస్):జైపూర్ మండలం రామారావుపేట గ్రామానికి చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచడం పట్ల గ్రామ సర్పంచ్ పులి రాజశేఖర్ హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లోని కోటా ఇన్స్టిట్యూట్‌లో చదువుతున్న సూర భీరయ్య -- స్వప్న దంపతుల కుమారుడు సూర సాత్విక్ 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ కైవసం చేసుకోగా, అదే గ్రామానికి చెందిన అమరగొండ హర్షిత్ 464 మార్కులతో ఉత్తీర్ణత సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచారని తెలిపారు.సాధారణ కుటుంబాల నుండి వచ్చిన ఈ విద్యార్థులు పట్టుదలతో చదివి ఇంతటి గొప్ప పేరు తీసుకురావడం సంతోషదాయకమని కొనియాడారు.విద్యార్థుల కృషిని, వారికి అండగా నిలిచిన తల్లిదండ్రులను,ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నామాల నాగరాజు, వార్డు సభ్యులు, గ్రామస్థుల పాల్గొన్నారు.

# ముందస్తు అంబేద్కర్ జయంతి వేడుకలు




మంథని ఏప్రిల్ 13 (మనం న్యూస్) మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూఏసి, ఎన్ఎస్ఎస్,చరిత్ర, రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ముందస్తు అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ పరిషయ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఈరోజు మనం అనుభవిస్తున్న ప్రతి అంశం వెనుక అంబేద్కర్ కృషి ఉందన్నారు.అనేక దేశాల రాజ్యాంగాలను అవపోసన పట్టి మన భారత రాజ్యాంగాన్ని రచించారని ఆయన తెలిపారు.భారత రాజ్యాంగం పట్ల యువత విధేయులుగా ఉంటూ భావితరాలకు ఆదర్శంగా నిలవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ కృష్ణ,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్. లక్ష్మీనారాయణ,చరిత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్,అధ్యాపకులు అమర్నాథ్, ముకుందం,ఫర్హానా, మానస,దుర్గంకృష్ణ, శేఖర్,శ్రీధర్,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



మంథని ఏప్రిల్13 (మనం న్యూస్,) కరీంనగర్ అపెక్స్ హాస్పిటల్ వారి సహకారంతో ఆదివారం బోయిన్ పేట కౌన్సిలర్ పోతరవేని శ్రీలతక్రాంతి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేషా స్పందన లభించింది. ఈ ఉచిత వైద్య శిబిరంలో ముఖ్యంగా చిన్న పిల్లల నిపుణులు,ఈసీజీ, ఉచితంగా మందులు పంపిణి చేయడంతో వందల మంది పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు తీసుకొని బోయిన్ పేట్ ప్రజలందరు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. బోయిన్ పేట ప్రజలు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండాలని ఆలోచించే బోయిన్ పేట్ కౌన్సిలర్ శ్రీలత-క్రాంతి సేవలను ప్రజలు అభినందించారు. ఈ సందర్భంగా శ్రీలత క్రాంతి మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన అపెక్స్ హాస్పిటల్ నిర్వాహకులైన డాక్టర్ భరత్ రెడ్డికి,వారి సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

# విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



బెల్లంపల్లి రూరల్, ఏప్రిల్ 13,(మనం న్యూస్) : బట్వాన్ పల్లి గ్రామ పంచాయతీలోని విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని సోమవారం బెల్లంపల్లి రూరల్ విద్యుత్ కి గ్రామానికి చెందిన 7వార్డ్ సభ్యుడు రత్నం సోము, బిఆర్ఎస్ నాయకుడు గోమాస వినోద్ లు గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని ఏఈ కీ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఈ సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

# తెలంగాణ ఉద్యమ కారులు 28న నిర్వహించే సమావేశానికి భారీగా తరలిరండి



మంథని,ఏప్రిల్13 (మనంన్యూస్)హైదరాబాద్ వేదికగా ఈ నెల18వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి విస్తృత స్థాయి తెలంగాణ ఉద్యమకారుల సమావేశానికి మంథని నియోజకవర్గ నాయకులు, ఉద్యమకారులు భారీగా తరలిరావాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం దేవేందర్ గౌడ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఈ భారీ బహిరంగ సమావేశం జరగనుంది అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ విజయశాంతితో పాటు రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకులు హాజరై దిశానిర్దేశం చేయనున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్క ఉద్యమకారుడు, కార్యకర్త బాధ్యతగా ఈ సమావేశానికి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.మంథని నుండి 18 ఉదయమున హైదరాబాద్ లో జరిగే ఉద్యమకారుల సమావేశానికి బస్సును ఏర్పాటు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్న తరుణంలో ఈ సమావేశానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, మంథని గడ్డ నుంచి మన గళాన్ని చాటాలని వారు విజ్ఞప్తి చేశారు.

# రక్తదాన శిబిరంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



మంథని ఏప్రిల్13 (మనంన్యూస్)స్వర్గీయ శ్రీపాదరావు 27వ వర్ధంతి సందర్భంగా వారివిగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రతిమ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరంలో సోమవారం మంథని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, మాజీ యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఎండి.జాఫర్ పాషా బ్లెడ్ డొనేట్ చేశారు.ఈ సందర్భంగా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్త దానం చేసిన నాయకులను, కార్యకర్తలను మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు.

# ప్రతి పౌరుడు రోడ్డు భద్రత పాటించాలి




మంథని ఏప్రిల్13 (మనం న్యూస్) ప్రతి పౌరుడు రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటించాలని మంథని ఆర్టీసీ డిపో మేనేజర్ వి శ్రావణ్ కుమార్ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈరోజు మంథని డిపో మేనేజర్ వి.శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై రవాణా శాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు మరియు ఆర్టీసీ ఉద్యోగులు సంయుక్తంగా అరేయ్-అలైవ్ ప్రోగ్రామ్ లో భాగంగా మంథని డిపో నుండి అంబేద్కర్ చౌక వరకు ర్యాలీ నిర్వహించినారు.ప్రతి ఒక్క పౌరుడు రోడ్డు భద్రత పాటించాలని, హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం నడపాలని, వేగం కన్నా ప్రాణం మిన్న అని,మద్యం సేవించి వాహనం నడప రాదని,సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, అని స్లొగన్స్ ఇస్తూ ర్యాలీ నిర్వహించారు.ఇట్టి కార్యక్రమంలో పెద్దపల్లి ఏఎంవిఐ వంశీకృష్ణ , మంథని ఏఎస్ఐ చలం,పోలిశెట్టి కానిస్టేబుల్ రాజేశం, ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ ఎం సాగర్ రెడ్డి ,డిపో అసిస్టెంట్ మేనేజర్ ఏంజిల్ , మెకానికల్ సూపర్వైజర్ ఇక్బాల్ , అధిక సంఖ్యలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో శ్రీపాద రావు వర్ధంతి వేడుకలు



మంథని ఏప్రిల్13 (మనం న్యూస్)మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీపాద రావు27వ వర్ధంతి సందర్భంగా సోమవారం మంథని మునిసిపల్ కార్యాలయమ-ంలో మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ అధ్యక్షతన స్వర్గీయ శ్రీపాద రావు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులుఅర్పించారు. మంథని నియోజకవర్గానికి శ్రీపాదరావు చేసిన సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఎన్.మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల.సహేందర్ రెడ్డి,పాలక వర్గ సభ్యులు కుర్ర లింగయ్య,నూకల కమల్,మద్దికట్ల స్రవంతి,పోతరబోయిన శ్రీలత,జంబోజు శ్రీమతి, మారుపాక నిహారిక, వేముల లక్ష్మి, యెల్లంకి వంశీధర్, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వమే మతం.. రక్తదానమే నినాదం




జైపూర్, ఏప్రిల్ :13 (మనం న్యూస్):జైపూర్ మండల కేంద్రంలోని ఎస్ టి పి పి లో భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను పురస్కరించుకొని సోమవారం భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల సహాయార్థం ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఎస్టిపిపి ఈడి సిహెచ్. చిరంజీవి ప్రారంభించి, స్వయంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులరహిత సమాజం కోసం, మానవత్వమే మతం, రక్తదానమే నినాదంతో వరుసగా ఏడవ ఏడాది ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు.అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ప్రాణదాతలుగా మారాలని పిలుపునిచ్చారు.పెద్ద ఎత్తున రక్తదానం చేశారు.రక్తదాతల సేవలను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు ఈ సందర్భంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో జీఎం నరసింహారావు, వివిధ సంఘాల నాయకులు, సీఐఎస్ఎఫ్ జవాన్లు, పవర్ మేక్ కంపెనీ సిబ్బంది, స్థానిక గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులు నిరంతరం చేపడతాం



లక్షెటిపేట ఏప్రిల్ 13 (మనం న్యూస్) లక్షెట్టిపేట మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తామని మున్సిపల్ చైర్పర్సన్ అంజలి స్పష్టం చేశారు..మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడుతూ…పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడమే తమ లక్ష్యమన్నారు. కౌన్సిలర్లు తమ వార్డుల్లోని సమస్యలను దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు..

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి




లక్షెట్టిపేట ఏప్రిల్ 13(మనం న్యూస్) : మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్ మహాత్మ అన్నారు. సోమవారం పట్టణంలోని డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ…. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు చదువుకోవాలన్నారు. విద్యార్థిగా ఉన్నప్పుడే కష్టం తో కాకుండా ఇష్టపడి చదువుకుంటే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. క్రమశిక్షణ, అంకిత భావంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు పలువురు మాట్లాడుతూ విద్యార్థి దశ కీలకమైందని వివరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో గోదావరి ఖని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా, శ్రీనివాస్ కే సంధ్య అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తాటి చెట్టు పై నుండి పడి గీతకార్మికుడికి గాయాలు

పెద్దపల్లి/ఎలిగేడు ఏప్రిల్ 13 (మనం ప్రతినిధి): పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం దులికట్ట గ్రామానికి చెందిన గీతా కార్మికుడు భూసారపు కొమురయ్య గౌడ్ (58) వృత్తిలో భాగంగా ఈరోజు ఉదయం తాడిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడడం జరిగింది.. గమనించిన తోటి గీతా కార్మికులు హుటాహుటిన కరీంనగర్లోని ప్రతిమ హాస్పటల్ కు తరలించడం.. పరీక్షించిన వైద్యులు కొమురయ్య గౌడ్ కుడికాలు విరిగిపోయిందని వెంటనే ఆపరేషన్ చేసి రాడు వేయాలని తెలిపారు.. వృత్తిపైనే ఆధారపడి బతుకుతున్న కొమురయ్య గౌడ్ ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సహాయం కింద 15 వేల రూపాయలు మరియు ఎక్స్ గ్రేషియా అందించి ఆదుకోవాలని గౌడ సంఘం అధ్యక్షులు నర్సయ్య గౌడ్ మాకు దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.

## నిరుపేదకు అండగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



లక్షెట్టిపేట, ఏప్రిల్ 13: (మనం న్యూస్) నిరుపేద కుటుంబానికి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అండగా నిలిచారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ వైద్య ఖర్చులకు ఆపన్న హస్తం అందించి ఆదుకున్నారు. వివరాల్లోకి వెళితే మండలంలోని హన్మంత్ పల్లి గ్రామానికి చెందిన లావణ్య అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే తన నివాసంలో సోమవారం వైద్య ఖర్చుల కోసం రూ. 2 లక్షల 25 వేల ఎల్ ఓ సీ అందజేశారు.ఎమ్మెల్యేకు లావణ్య కుటుంబ సభ్యులు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూర్ణ చందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## టేకుమట్లలో ఘనంగా రోడ్డు భద్రత వారోత్సవాలు



జైపూర్, ఏప్రిల్ :13(మనం న్యూస్): జైపూర్ మండలం టేకుమట్లలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సర్పంచ్ బల్ల వెంకటేష్ అధ్యక్షతన స్థానిక పోలీసులు రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై రాజశేఖర్ గ్రామ ప్రజలకు, విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సీట్ బెల్ట్ వినియోగించాలని, అతివేగాన్ని నియంత్రించి సురక్షిత ప్రయాణం సాగించాలని ఆయన కోరారు.ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనల పట్ల చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.అనంతరం ప్రభుత్వ పాఠశాల పిల్లలు ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి మద్యం సేవించి వాహనం నడప రాదని, రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోనె ప్రవీణ్, గ్రామ కార్యదర్శి శ్రావణి, డి.సి.సి కార్యదర్శి గోనె నర్సయ్య, వార్డు సభ్యులు, యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు .

## భావితరాల కోసం రోడ్డు విస్తరణ చేపట్టిన మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



లక్షతి పేట ఏప్రిల్ 13 (మనం న్యూస్) సమాజ శ్రేయస్సు దృష్ట్యా భావితరాలకు మేలు కలగాలని లక్ష్యంగా పెట్టుకుని లక్షెట్టిపేట మున్సిపాలిటీలో రోడ్డు వెడల్పు కార్యక్రమాన్ని చేపడుతున్నామని మంచిర్యాల శాసనసభ్యులు శ్రీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తెలిపారు. సోమవారం లక్షెట్టిపేట్ ఐబీ గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో కొంతమందికి నష్టం జరిగిన, సమాజ ప్రయోజనం దృష్ట్యా అందరూ సహకరించాలని కోరారు. 100 మందిలో ఐదుగురికి నష్టం జరిగిన, వారు సహనంతో మిగతా వారికి మేలు జరిగేలా సహకరించాలి అని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తు తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు.మంచిర్యాల నియోజకవర్గంలో సాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో లక్షెట్టిపేట్ మున్సిపల్ చైర్మన్ దొంతు అంజలి -నర్సయ్య వైస్ చైర్మన్ మోత్కూరి రాజేశ్వరి -వెంకట్ స్వామి గౌడ్ , కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ శ్రీపాదరావు ఆశయాలను కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకెళ్తుంది




జమ్మికుంట, ఏప్రిల్ 13 (మనం న్యూస్): స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాదరావు ఆశయాలను కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకెళ్తుందని కాంగ్రెస్ పార్టీ జమ్మికుంట పట్టణ అధ్యక్షులు సుంకరి రమేష్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్పీకర్, మంథని మాజీ ఎమ్మెల్యే, స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాదరావు 27వ వర్ధంతి సందర్భంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో జమ్మికుంట గాంధీ చౌక్ లో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ… ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి శాసనసభ స్పీకర్ గా ఈ ప్రాంత అభివృద్ధి కొరకై ఎంతో కృషి చేసిన వ్యక్తిగా శ్రీపాద రావుకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. శాసనసభ కే వన్నె తెచ్చి ఎంతోమందికి దిక్సూచిగా నిలిచినటువంటి గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మొలుగురి సదయ్య, కౌన్సిలర్స్ మాచర్ల రాజు, యాట్ల సునీత అశోక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూరి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండి సలీం, ఎండి సజ్జు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎగ్గని శ్రీనివాస్, సలీం పాషా, పాత ప్రసాద్, చిన్నింటి నాగేంద్ర, ఆడెపు కిరణ్, చంచల శ్రీనివాస్, రాజ్ కుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీపాదరావు సేవలు మరువలేనివి

పెద్దపల్లి ఏప్రిల్ 13 (మనం న్యూస్): స్వర్గీయ మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాద రావు సేవలు మరువలేనివని జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భూషణవేణ సురేష్ గౌడ్ అన్నారు. పెద్దపల్లి పట్టణంలో సోమవారం శ్రీపాద రావు 27వ వర్ధంతి నిర్వహించారు. శ్రీపాద రావు చిత్రపటానికి



నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నయ్య గౌడ్, సురేష్ గౌడ్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు రాష్ట్ర ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు శ్రీపాద రావు అని కొనియాడారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గుజ్జుల కుమార్, మంథని నర్సింగ్, తూముల సుభాష్ రావు, పాగాల శ్రీకాంత్, పూదరి మహేందర్, అమ్రేష్, నదీం, తిర్రి రాజు, నాంసాని శ్రీనివాస్, నాయకులు శ్రీమాన్, బూతగడ్డ సంపత్, కటికనపల్లి రవి, అమిరిశెట్టి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత అందరి బాధ్యత..!

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 13(మనం ప్రతినిధి ):రోడ్డుపై ప్రయాణించే ప్రతి వాహనదారుడు సామాజిక బాధ్యతగా భద్రత చర్యలు తీసుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి వి.లక్ష్మణ్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ ఆఫీసులో సోమవారం ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక, 99 రోజుల



కార్యక్రమంలో భాగంగా వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. వాహనదారులందరూ భద్రత ప్రమాణాలను పాటించాలన్నారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, నిదానంగా ప్రయాణించడం, రోడ్డు భద్రత సూచనలు పాటించాలన్నారు. సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు.. ప్రమాద రహిత సమాజం కోసం కృషి చేయాలని లక్ష్మణ్ కోరారు. ప్రాణాలు అమూల్యమైనవని, ప్రమాదాల నివారణను సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. ఎవరికివారు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు జరగవని, మద్యం తాగి వాహనాలను నడపవద్దని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆఫీసుకు వచ్చిన వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం వి ఐ పృథ్వీరాజ్ వర్మ, రవాణా శాఖ సిబ్బంది కల్పన, రమ్య, సౌమ్య పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత పై టేకులబస్తిలో ప్రజల ప్రతిజ్ఞ.

బెల్లంపల్లి, ఏప్రిల్ 13,(మనం న్యూస్) : రోడ్డు భద్రత పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండి రోడ్డు ప్రమాధాల ద్వారా సంభవించే మరణాల నివారణ కు ప్రతి ఒక్కరు కృషి చేయాలని 15 వ వార్డు టేకులబస్తి కౌన్సిలర్ చింతల వసంత పిలుపునిచ్చారు.రోడ్డు భద్రత ప్రమాధాల నివారణ పై సోమవారం టేకులబస్తి లో



బెల్లంపల్లి వన్ టౌన్ మహిళా హెడ్ కానిస్టేబుల్ కంపెల జ్యోతి ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన ప్రతిజ్ఞ కు కౌన్సిలర్ వసంతముఖ్యతిధిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణ కు ప్రజలు అనుసరించాల్సిన రక్షణ సూత్రాల ను ప్రజలు ప్రతి ఒక్కరు పాటించాలనిరాష్ట్ర డీ జీ పీ పిలుపునిచ్చారని ఆమె పేర్కొన్నారు. ప్రజలు సంఘటితంగా ఉండి రోడ్డు ప్రమాదాల నివారణకు, రోడ్డు భద్రత నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాల ద్వారా సంభవించే మరణాలను, రోడ్డు ప్రమాదాల ద్వారా ప్రజలు అంగవైకల్యులు కాకుండా చూడాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు.భారతదేశ పౌరుడిగా, మోటారు వాహనముల చట్టంలో పొందుపరిచిన రోడ్డు నియమ నిబంధనలను పాటిస్తామని కౌన్సిలర్ ప్రజల తో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలోఅంగన్ వాడీ టీచర్ ఆడెపు పద్మ, ఆశా కార్యకర్త సుజాత, ఆయమ్మ కమల,టీ పీ సీ సీ మీడియా కమ్యూనికేషన్స్ జిల్లా కన్వీనర్ దేవసాని ఆనంద్,కాంగ్రెస్ నాయకులు కసిపాక రాజరత్నం, ఎండీ గౌస్,బొల్లివంశీకృష్ణ, ఎస్ కే సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు జమ్మికుంట పత్తి మార్కెట్ యార్డుకు సెలవు

జమ్మికుంట, ఏప్రిల్ 13 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో అతి పెద్ద రెండవ వ్యవసాయ మార్కెట్‌గా పేరుగాంచిన జమ్మికుంట పత్తి మార్కెట్‌కు "డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి" సందర్భంగా మంగళవారం సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం అధికారిక సెలవు ప్రకటించిన నేపథ్యంలో మార్కెట్ యార్డు కూడా పూర్తిగా మూసివేయబడుతుందని ఆమె పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలు, సామాజిక న్యాయం, సమానత్వం, విద్యా ప్రాముఖ్యత వంటి విలువలు ప్రతి ఒక్కరూ ఆచరించాల్సినవని ఈ సందర్భంగా ఆమె గుర్తుచేశారు. ఈ సందర్భంగా రైతు సోదరులు, అడ్తీలు, పత్తి కొనుగోలు వ్యాపారులు, గుమస్తాలు, హమాలీలు, దాడువాయి కార్మికులు, ట్రాక్టర్ మరియు ట్రాలీ డ్రైవర్లు మార్కెట్ యార్డుకు సెలవు విషయాన్ని గమనించాలని కోరారు. రైతులు దూర ప్రాంతాల నుండి మార్కెట్‌కు వస్తుండటంతో ముందస్తుగా ఈ సమాచారం తెలుసుకుని తమ ప్రయాణాలను సక్రమంగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. తిరిగి బుధవారం మార్కెట్ లో యథావిధిగా పత్తి కొనుగోలు జరుగుతాయని తెలిపారు.

# కేసీఆర్ కప్ క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలి

బోయిన్ పల్లి, ఏప్రిల్ 13(మనం న్యూస్ ): కేసీఆర్ కప్ క్రికెట్ టోర్నమెంటులో పాల్గొనే యువకులు క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. బోయినిపల్లి మండలం స్తంభంపల్లి గ్రామ మైదానంలో నిర్వహిస్తున్న కేసీఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలసి ప్రారంభించిన అయన



టోర్నమెంట్ లో పాల్గొనే క్రీడాకారులకు క్రికెట్ కిట్ క్రీడా దుస్తులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదేశాల మేరకు సిరిసిల్ల జిల్లాలోని మండలాలో నిర్వహించే ఈ టోర్నమెంటులో 12 మండలాలు, 2 మున్సిపాలిటీలు, మండల స్థాయిలో గెలిచిన జట్టుకు రూ. 50వేలు క్యాష్ ప్రైజు, రన్నర్ జట్టుకు రూ. 20వేల ప్రైజ్ మనీ ఉంటుందని, ప్రతీ మండలం నుంచి రెండు జట్లు, మొత్తంగా జిల్లా స్థాయిలో 32 జట్లు పోటీ పడనున్నట్లు తెలిపారు. ఈ నెల పదో తేదీ నుంచి 17వరకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల, మున్సిపాలిటీ స్థాయిలో లీగ్ మ్యాచులు నిర్వహిస్తారని, 18 నుంచి 25 తేదీ వరకు జిల్లా కేంద్రంలో పోటీలు ఉంటాయని చెప్పారు. పోటీల్లో గెలుపోటములు సహజమని చెప్పారు.గ్రామీణ ప్రాంతాలలో క్రీడాకారులను వెలికి తీయడమే ఈ కేసీఆర్ కప్ ఉద్దేశం అని,ఈ టోర్నమెంట్ లో పాల్గొంటున్న క్రీడాకారులందరికి శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలని ఈ సందర్భంగా అయన కోరారు.ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లెంకాల సత్యనారాయణ రెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# రేచపల్లి గ్రామంలో రోడ్డు సేఫ్టీ గ్రామ సభ నిర్వహణ

సారంగాపూర్ మండలం ఏప్రిల్ 13(మనం న్యూస్): సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలో ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా "అరైవ్ అలైవ్" వారోత్సవాన్ని పురస్కరించుకొని, సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రోడ్డు సేఫ్టీ గ్రామ సభ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శ్రీ బాస



మహేష్ అధ్యక్షత వహించారు. గ్రామంలోని పాలవర్గ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు, రైతులు మరియు వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సారంగాపూర్ మండల ఎస్సై పాకాల గీత ముఖ్య అతిథిగా పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, ట్రాఫిక్ నియమాలను పాటించడం, హెల్మెట్ మరియు సీటుబెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపకూడదని ప్రజలకు సూచించారు. గ్రామంలో ప్రమాదాలు నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి, అందరితో ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో విధులు నిర్వహించే ఉద్యోగులు, గ్రామ ప్రజలు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మృతుడి కుటుంబానికి ప్రమాద భీమా చెక్కు పంపిణీ

మంథని ఏప్రిల్ 13 (మనం న్యూస్) : మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో స్వల్పకాలిక ఋణం తీసుకొని రోడ్డు ప్రమాదం లో మరణించిన మండలంలోని కన్నాల గ్రామానికి చెందిన ఉడుత చంద్రయ్య కుటుంబానికి లక్ష రూపాయల చెక్కు మంజూరు కాగా, సంఘ అఫిషియల్ పర్సన్ ఇంచార్జి కె.అనిల్ కుమార్ కెడిసిసి బ్యాంకు మేనేజర్ కె.ఉ



దయశ్రీ, డిఈ సందేబోయిన శ్రీనివాస్ తో కలిసి సోమవారం సాయంత్రం అతని భార్య స్వరూప కు అందజేశారు.సంఘం యందు స్వల్ప కాలిక ఋణం తీసుకున్న ప్రతీ ఒక్క రైతుకు సహకార సంఘం ద్వారా ప్రమాద భీమా సౌకర్యం కల్పించబడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్,ఏఎంసి వైస్ చైర్మన్ ముస్కుల ప్రశాంత్ రెడ్డి,కన్నాల సర్పంచ్ గుడిసె గట్టయ్య,మాజీ సర్పంచ్ పోయిల రాజయ్య,నాయకులు కావటి సమ్మయ్య, సందీప్,బుదారపు సతీష్,నాంపల్లి రంజిత్,సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

# రేచపల్లి గ్రామ విద్యార్థులకు సన్మానం

సారంగాపూర్ మండలం ఏప్రిల్ 13 (మనం న్యూస్): సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు విద్యలో ప్రతిభ కనబరచి గ్రామానికి గర్వకారణంగా నిలిచారు.కట్ల రక్షిత ఇంటర్ మొదటి సంవత్సరంలో 464/470 మార్కులు సాధించగా, సంధి రక్షిత్ రెడ్డి ఇంటర్ మొదటి సంవత్సరంలో 454/470 మార్కులు సాధించారు. అలాగే భానోజీ శశిధర్ ఇంటర్ రెండవ సంవత్సరంలో



975/1000 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బాస మహేష్ ఆధ్వర్యంలో ఈ ప్రతిభావంతులైన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సారంగాపూర్ మండల ఎస్సై పాకాల గీత, గ్రామ కార్యదర్శి రాముడుగు సంతోష్ రావు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ఫలితాలలో వందశాతం ఉత్తీర్ణత



బెల్లంపల్లి, ఏప్రిల్ 13,(మనం న్యూస్) : తెలంగాణ సాంఘిక సంక్షేమ కాసిపేట గురుకుల కళాశాల ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో సిఇసి రెండవ సంవత్సరంలో 22 విద్యార్థులకు 22 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి100% , అలాగే ప్రథమ సంవత్సరంలో 28 విద్యార్థులకు గాను 27 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 96% ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ పూటూరి సంతోష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ సి.ఇ.సి.ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు గాను ఇ .లోకేష్ 953, కె .శేఖర్ 875, కె. అభినయ్ 849, వీ. లక్ష్మీనారాయణ 840 ,డి.దినేష్ కుమార్ 822, గణేష్ 812 మార్కులు సాధించారన్నారు. సి.ఇ.సి. ప్రథమ సంవత్సరంలో 500 మార్కులకు గాను కె తారక్ నాథ్ 485, ఎన్. తనీష్ 467, సిహెచ్ జస్వంత్ 463, ఎల్ హరి ప్రసాద్ 462, బి.నిఖిల్ 460 సాధించారన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మార్కుల సాధించిన విద్యార్థులను, అధ్యాపకులను ప్రత్యేకంగా అభినందించారు.

# ఇందిరమ్మ గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న జువ్వాడి కృష్ణారావు



కోరుట్ల ఏప్రిల్ 13 (మనం న్యూస్) : కోరుట్ల పట్టణం లోని 3వ వార్డు కు చెందిన చిట్యాల అశోక్ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకొని సోమవారం గృహప్రవేశం చేసిన సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు గృహప్రవేశానికి హాజరై వారికి నూతన వస్త్రాలను అందజేసి అశోక్ కుటుంబ సభ్యులను అభినందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ఏ ఒక్కరు కూడా ఇల్లు లేకుండా ఉండకూడదు అనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పథకాన్ని చేపట్టారని నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికి ఇంటి నిర్మాణమే తమ ధ్యేయమని జువ్వాడి కృష్ణారావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావుతో పాటు మున్సిపల్ ఛైర్పర్సన్ శ్రీమతి తిరుమల వసంత గంగాధర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగదర్ కౌన్సిలర్ లు మోర్గాడ్ లక్ష్మీనారాయణ, తెడ్డు విజయ్, రేంజర్ల కళ్యాణి, సెట్టిపల్లి రంజిత్ కుమార్ గుప్తా, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు

సైదాపూర్ ఏప్రిల్ 13(మనం న్యూస్) : సైదాపూర్ మండల కేంద్రం లోని కొత్త బస్టాండ్ ఆవరణలో జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల లో భాగంగా గ్రామ సర్పంచ్ మునిగంటి స్వప్న - సంతోష్ అధ్యక్షతన హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సంబంధించిన ధ్రువ పత్రాలు ఉంచుకొని రోడ్డు నియమాలు పాటించాలని స్థానిక ఎస్ ఐ స్వాతి ప్రజలకు, యువకుల కు అవగాహన కల్పిస్తూ, ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ గోపాగోని నవీన్ గౌడ్, గొల్లపల్లి, యాదగిరి, గొల్లపల్లి కనకయ్య, విద్వాన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సారయ్య, జిపిఓ స్వప్న, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# గృహ ప్రవేశాలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి హాజరు

శంకరపట్నం ఏప్రిల్ 13 (మనం న్యూస్) శంకరపట్నం మండలం కన్నాపూర్,రాజాపూర్,లింగాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సోమవారం జరుపుకున్న గృహ ప్రవేశాలకు టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్,మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కన్నాపూర్ లో బండి కొమురమ్మ, సదయ్య దంపతులు, రాజాపూర్ గ్రామంలో రెడ్డి వర్ణ జంపయ్య దంపతులు, లింగాపూర్ గ్రామంలో నాగండ్ల సృజన - రాజు దంపతులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వారు నిర్మాణాలు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గృహ ప్రవేశాలు జరుపుకున్న సదరు దంపతులను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అభినందిస్తూ శాలువాలతో సత్కరించారు.

### వైకుంఠ రథం అందజేత

శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామ సర్పంచ్ కొంకటి రవి పంచాయతీ కార్యాలయానికి వైకుంఠ రథాన్ని బహూకరించారు. సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వైకుంఠ రథాన్ని ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా.కవ్వంపల్లి సత్యనారాయణ పంచాయతీకి అందజేశారు. గ్రామస్తుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని సొంత నిధులతో వైకుంఠ రథాన్ని సమకూర్చిన సర్పంచ్ కొంకటిని రవిని ఎమ్మెల్యే ప్రత్యకంగా అభినందించారు. అంతకు ముందు రాజపూర్ గ్రామంలో శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ నిర్మాణ పనులకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం భూమిపూజ చేశారు.



### శంకరపట్నం మండలంలో పరామర్శ

ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన శంకరపట్నం మండలం ఇప్పలపల్లి గ్రామ సర్పంచ్ బొల్లెద్ద కమలను టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. సోమవారం లింగాపూర్ లోని ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించడమే కాకుండా ప్రమాదానికి దారితీసిన పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పీసీసీ సభ్యుడు, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, శంకరపట్నం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపగోని బస్వయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపెల్లి తిరుపతి, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కవ్వ పద్మ, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చింతిరెడ్డి పద్మ, కన్నాపూర్, రాజాపూర్,లింగాపూర్ గ్రామాల పార్టీ అధ్యక్షులు చింతిరెడ్డి రాజిరెడ్డి, తాటికొండ సదానందం, తడిసిన నారాయణ రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిరుపతి గౌడ్, మెట్ పల్లి ఉప సర్పంచ్ గొట్టె మధు, పార్టీ నాయకులు అడెపు అజయ్, ఇసామొద్దీన్, జనగాం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు బాధ్యత ప్రవర్తిస్తేనే ప్రమాదాలు తగ్గుముఖం

మంథని ఏప్రిల్13 (మనం న్యూస్) ప్రతి ఒక్కరూ బాధ్యతతో ప్రవర్తిస్తేనే ప్రమాదాలను తగ్గించి సురక్షిత రోడ్డు ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించవచ్చని పెద్దపల్లి డిసిపి బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసిపి ఎం.రమేష్ లు అన్నారు.సోమవారం మంథని మండలంలోని పలు గ్రామాలలో అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని మంథని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎగ్లాస్ పూర్ గ్రామంలో ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డిసిపి బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఎసిపి ఎ రమేష్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

వాహదారులు కోసం సురక్షిత ప్రయాణంతో ప్రాణాలతో ఇంటికి చేరుకోవాలని,రోడ్డు భద్రతపై పోలీసుల అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి నుంచి వాహనం పై బయలుదేరి పని ముగించుకుని మరల తిరిగి ప్రాణాలతో ఇంటికి సురక్షితంగా చేరుకోవాలన్నారు. ఇటీవల మంథనిలో జరిగిన పలు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం డ్రైవర్ల నిర్లక్ష్యమేనని తెలిపారు.ర్యాష్ డ్రైవింగ్,హెల్మెట్ లేకుండా బైక్ నడపడం,సీట్ బెల్ట్ ధరించకపోవడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, సెల్‌ఫోన్ ఉపయోగించడం వంటి చర్యలు ప్రమాదాలకు దారి తీస్తున్నాయని చెప్పారు.వాహనదారులు తమ భద్రత కోసం, తమ కుటుంబాల కోసమే ట్రాఫిక్ నియమాలు పాటించాలని కోరారు. పోలీసులు సేకరించిన



ప్రమాదాల వివరాలను విశ్లేషించగా,ఎక్కువ ప్రమాదాలకు వాహనదారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని వెల్లడైందన్నారు.కారు, లారీ,బైక్ ట్రాక్టర్ డ్రైవర్లు సైతం ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ప్రజల సహకారం లేకుండా పోలీసుల ప్రయత్నాలు ఫలించవనీ,అందరూ కలిసి పనిచేస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు.పోలీసులు ఈ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గంజాయి రహిత ప్రాంతంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.అనంతరం పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు,యువత, అందరితో రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని,మిగతా వారితో పాటించేలా చేస్తామని ప్రమాద రైతు ప్రాంతంగా ఏర్పాటుకు తమ వంతు కృషి తప్పక చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. పోలీస్ సిబ్బంది ఏఎస్ఐ కే. శ్రీనివాస్,పి.మల్లయ్య, పి.సుదర్శన్,పిసిడి. వంశీకృష్ణ,పిసి.టీ అనిల్ కుమార్,పిసి. రామకృష్ణ పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహాన్ని పాలతో శుద్ధి చేసిన బిజెపి నాయకులు

జమ్మికుంట, ఏప్రిల్ 13 (మనం న్యూస్): భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడి పిలుపు మేరకు అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం జమ్మికుంట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహాన్ని బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు ఆధ్వర్యంలో పాలతో శుద్ధి చేశారు. ఈ సందర్భంగా కొలకాని రాజు, కౌన్సిలర్ శీలం శ్రీనివాస్ మాట్లాడుతూ... అంబేద్కర్ అంటేనే భారత రాజ్యాంగ రూపకర్తగా ప్రసిద్ధి పొందారని,భారత రాజ్యాంగం తయారీలో ప్రధాన పాత్ర పోషించారని, దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేశారని,సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలను ప్రోత్సహించారని, భారతదేశ తొలి న్యాయశాఖ మంత్రిగా, రాజ్యాంగ రచనా కమిటీ చైర్మన్ గా వ్యవహరించారని కొనియాడారు. అంబేద్కర్ ప్రధాన లక్ష్యం సమాజంలో సమానత్వం తీసుకురావడం అని అన్నారు. "శిక్షణ పొందండి, సంఘటితమవండి, పోరాడండి" అనే ఆయన నినాదం ఈరోజు దేశ ప్రజలకు స్ఫూర్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జమ్మికుంట పట్టణ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనే సాధ్యం




చిగురుమామిడి: ఏప్రిల్ 13 ( మనం న్యూస్) : పేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని,అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతుందని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి తెలిపారు.సోమవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం లంబాడిపల్లే గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారులు చామంతుల లచ్చవ్వ గృహప్రవేశం కార్యక్రమంలో చైర్మన్ తిరుపతిరెడ్డి,సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి,ఎంపీడీవో విజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో పార్టీలకు అతీతంగా ఎలాంటి పైరవీలకు తావు లేకుండా అర్హులైన నిరుపేదలను గుర్తిస్తున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ లబ్ధిదారులు యుద్ధ ప్రాతిపదికన తమ ఇండ్లను పూర్తిచేసుకుని ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.అర్హులైన పేదలకు రెండో విడతలో మరిన్ని ఇండ్లు మంజూరు చేస్తామని,పేదలు ఎవరు ఆధర్యపడవద్దని తిరుపతిరెడ్డి హామీ ఇచ్చారు.గృహప్రవేశం చేసిన లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు సర్పంచ్ సంపత్ రెడ్డి నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సంక్షేమ పథకాల అమలుతీరులో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని ఇందిరమ్మ లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్ కు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ విజయలక్ష్మి,గ్రామపంచాయతీ కార్యదర్శి పద్మావతి,వార్డు సభ్యులు జెట్టి సంపత్,జీల స్రవంతి,నాగెల్లి కళావతి, చందపోయిన శ్రీలత,మంద లచ్చయ్య,గ్రామస్తులు కర్ర అశోక్ రెడ్డి,పింగిలి సంపత్ రెడ్డి,అనుమడ్ల రాజిరెడ్డి,కాటం సంజీవరెడ్డి,నందికొండ మల్లారెడ్డి, నక్క పెద్ద ఓదెలు,కయ్యం లక్ష్మయ్య,చిమ్మని నాగరాజు, చందబోయిన పరుశరాములు పాల్గొన్నారు.

# డిఫెన్సీవ్ డ్రైవింగ్ తో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు



ఓదెల ఏప్రిల్ 13,(మనం న్యూస్) : పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్ సేఫ్టీ పై ఏర్పాటు చేసిన సమావేశంలో పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్ డిఫెన్స్ డ్రైవింగ్ తో రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చన్నారు.22 గ్రామాలలో రోడ్ సేఫ్టీ అవేర్నెస్ "అరైవ్-అలైవ్" ప్రోగ్రాం లను నిర్వహించి,గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీలను గ్రామ సర్పంచ్ అధ్యక్షతన ఏర్పాటు చేసి సభ్యులుగా ముగ్గురు మహిళలతో పాటుగా పదిమంది కమిటీ ఏర్పాటు చేశామన్నారు.గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీల ద్వారా రోడ్డు భద్రతపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించామన్నారు.ఈ కార్యక్రమాల్లో రెవెన్యూ,పంచాయతీ విభాగాల అధికారులు పాల్గొన్నారు. అరైవ్ అండ్ అలైవ్ ప్రోగ్రాం ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన ఎప్పటికప్పుడు కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా డిఫెన్సీవ్ డ్రైవింగ్ సూత్రాలలిగురించి వివరించారు.

డిఫెన్స్ డ్రైవింగ్ సూత్రాలు;

అనుభవజ్ఞులైన డ్రైవర్లు కొన్ని సార్లు తప్పులు చేస్తారు.వాహనంలో సాంకేతిక లోపాలు, వాతావరణ పరిస్థితులు, రహదారులపై తెలియని మలుపులు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. డిఫెన్సివ్ డ్రైవింగ్ ద్వారా ప్రమాదాలను నివారించవచ్చు.రాత్రి ప్రయాణంలో కనిపించే (రిఫ్లెక్టివ్) దుస్తులు ధరించండి.వాహనం నడుపుతున్నపుడు పరిసరాలను ఎప్పటికప్పుడు గమనించండి. రోడ్డుపై చిన్న పిల్లలు, వృద్ధులు, పాదచారులను గమనిస్తూ వాహనాన్ని జాగ్రత్తగా నడపండి.వాహనాలను దూకుడుగా నడుపుతున్న డ్రైవర్లకు దారి ఇవ్వండి.చిన్న రోడ్డునుంచి ప్రధాన రోడ్డులోకి ప్రవేశించునపుడు ఇరువైపులా గమనించండి.వేగంగా వెళ్లే వాహనాలకు కుడి వైపున నుండి దారి ఇవ్వాలి.ముందు ప్రయాణిస్తున్న వాహనాన్ని కుడినుండి మాత్రమే దాటాలి.వాహనం నడిపేటపుడు సెల్ ఫోన్ ఉపయోగించవద్దు.

### ప్రయాణానికి ముందు తీసుకోవలసిన జాగ్రత్తలు

బ్రేకులు,టైర్లు,లైట్లు,అద్దాలు,వైపర్ల పనితీరును పరిక్షించుకోవాలి. రోడ్డుపై ప్రమాదానికి కారణమౌతున్న ఇసుక, మట్టి,నూనె,ఇతర ద్రవాలను,ప్రమాదాలను పరిశీలిస్తూ నడపాలి. తోటి ప్రయాణీకుల అవసరాలను గుర్తించి, సరైన సంకేతాలు ఇవ్వండి. వాహనానికి-వాహనానికి మధ్య సురక్షిత దూరాన్ని పాటించాలి.

### సీట్ బెల్ట్ , హెల్మెట్ ప్రాముఖ్యత

హెల్మెట్ ధరించటం వలన ప్రమాద సమయంలో తలకు భద్రతనిచ్చి,మృత్యువు నుండి కాపాడుతుంది. హెల్మెట్ ధరించినపుడు స్ట్రాప్ తప్పనిసరిగా భిగించండి. ద్విచక్ర వాహనదారులు,వెనుక కూర్చునేవారు, 4 సంవత్సరాల పైబడిన పిల్లలు కూడా హెల్మెట్ ధరించాలి. కారులో ప్రయాణిస్తున్నపుడు డ్రైవర్ తో సహా అందరూ ప్రయాణీకులు సీటు బెల్టును తప్పక ధరించాలి.

### అతి వేగం వద్దు

వేగ పరిమితిని పాటించాలి. వేగం పెరిగే కొద్దీ ప్రమాద తీవ్రత పెరుగుతుంది. పాఠశాలలు,ఆసుపత్రులు,కూడళ్ల వద్ద వాహనాన్ని జాగ్రత్తగా నడపండి.

భారీ వాహనాలు :

భారీ వాహనాల ప్రధాన రహదారిపై ఎడమ వైపునే ప్రయాణించాలి.పరిమితికి మించిన లోడ్ వేయకూడదు,ఎత్తు పెంచకూడదు ఇది ప్రమాదానికి దారితీస్తుంది. భారీ వాహనాల పక్కన జాగ్రత్తగా ప్రయాణించండి. ఆకస్మికంగా ఓవర్ టేక్ చేయవద్దు.

మద్యం, మాదకద్రవ్యాలు,అలసట:

మద్యం సేవించి లేదా నిద్రమత్తులో వాహనం నడపడం అత్యంత ప్రమాదకరం. విశ్రాంతి లేకుండా ఎక్కువసేపు వాహనాన్ని నడపవద్దు. ప్రతి 2 గంటలకు ఒకసారి విరామం తీసుకోవాలి. కోపం,అసహనం ప్రమాదాలకు దారితీస్తుంది. అతిగా హారన్ మోగించవద్దు. తోటి ప్రయాణీకులతో సత్ప్రవర్తనతో మెలగండి.ఒక చిరునవ్వు చిరాకును దూరం చేస్తుంది. పొత్కపల్లి, గుంపుల గ్రామాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో జరిపిన"అరైవ్-అలైవ్" ట్రాఫిక్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ లో గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లు,ఉప-సర్పంచ్‌లు,గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో హాజరై రోడ్డు భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియమాలు,రాహ్వీర్ స్కీమ్ వివరాలు తెలుసుకున్నారన్నారు.పొత్కపల్లి ఎస్ఐ మార్గదర్శకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో హాజరైన అధికారులు,ప్రజలందరూ రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు.అంతేకాకుండా గ్రామస్తులతో కలిసి రోడ్డు భద్రతా కమిటీలను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన పెరిగినట్లు తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలను నిర్వీర్యం చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు కీలకమని,భవిష్యత్తులో కూడా ఇవి కొనసాగుతాయన్నారు.

# నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఆహ్వానం



సారంగాపూర్ మండలం ఏప్రిల్ 13(మనం న్యూస్): సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలో నిర్వహించనున్న నల్ల పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బాస మహేష్ ను పోచమ్మ దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మరియు గ్రామస్తులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు సర్పంచ్ మర్యాదపూర్వకంగా కలిసి కరపత్రం అందజేసి, కార్యక్రమానికి విచ్చేసి ఆశీర్వదించి విజయవంతం చేయాలని కోరారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించేందుకు, సంప్రదాయబద్ధంగా ఈ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# రోడ్డు భద్రత, నిబంధనలపై అవగాహన



కాసిపేట, ఏప్రిల్ 13(మనంన్యూస్)కాసిపేట మండలం దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాటిగూడ్, కోనూరు, దేవాపూర్ గ్రామ పంచాయతీ కేంద్రాల్లో సోమవారం వేరు వేరు గా ఏర్పాటు చేసిన గ్రామ సభల్లో ఎస్సై గంగారాం రోడ్డు భద్రత, నిబంధనలు, చర్యల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజా పాలన పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా జరిగిన సమావేశాల్లో, ద్విచక్ర వాహనదారులు తలకు హెల్మెట్ ధరించాలి, కారు నడిపే వారు సీట్ బెల్ట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన పేపర్లు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్సై సూచించారు. మద్యం సేవించి వాహనాలు డ్రైవ్ చేయడం, అతి వేగం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమని అన్నారు. రోడ్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు ఉంటాయని ఎస్సై హెచ్చరికలు చేశారు.అనంతరం సర్పంచ్ లు చైర్మన్ లుగా, వార్డు సభ్యులు, స్థానికుల తో రోడ్డు భద్రత అవగాహన సదస్సు కమిటి లను ఏర్పాటు చేశారు. ఈ గ్రామ సభల్లో దేవాపూర్ సర్పంచ్ సిడాం రామ్ దాస్, ఉప సర్పంచ్ అనసూర్య, పంచాయతీ కార్యదర్శి కవిత, తాటిగూడ సర్పంచ్ మడావి వెంకటేశ్, ఉప సర్పంచ్ విజయలక్ష్మి, కార్యదర్శి మౌనిక, కొనూర్ సర్పంచ్ పేరం మల్లేష్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, కోమటిచేను సర్పంచ్ జాడి మాణిక్య, ఉప సర్పంచ్ కొడప అనంతరావు, కార్యదర్శి ఉదయ్ కుమార్, ఆయా పంచాయతీల వార్డు సభ్యులు, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# సెల్ టవర్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలి

మందమర్రి, ఏప్రిల్ 13: (మనం న్యూస్) మందమర్రి సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ లో సెల్ టవర్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు.టవర్ నిర్మాణం జరిగితే పక్కనే ఉన్న సింగరేణి పాఠశాల విద్యార్థులు, మనోవికాస పాఠశాల విద్యార్థులు అనారోగ్యానికి గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి దినం ఉదయం సాయంత్రం అనేకమంది ప్రజలు, క్రీడాకారులు గ్రౌండ్ లో సాధన చేస్తారని ఆరోగ్యం మాట అటు ఉంచి టవర్ నుంచి వెలువడే రేడియేషన్ వల్ల అనారోగ్యం తప్పదని వారన్నారు. నేడు నీటి కాలుష్యం, శబ్దం కాలుష్యం, వాయు కాలుష్యంతో సతమతమవుతున్న వారికి టవర్ కాలుష్యం తెచ్చిపెట్టడం ఏంటని వారు వాపోయారు. ఈ విషయంలో కలెక్టర్ తక్షణశీ స్పందించి చర్యలు తీసుకోవాలని, టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు దుర్గం ప్రభాకర్ రాజేశం తదితరులు వినతిపత్రంలో కోరారు.



## పదవ తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ



కరీంనగర్ ఏప్రిల్ 13(మనం బ్యూరో)..కరీంనగర్ లోని పారామిత హై స్కూల్ సిద్దార్థ హై స్కూల్ లో పదో తరగతి పరీక్ష కేంద్రాలను సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాస్తున్న పరీక్ష తీరును పరిశీలించారు. సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షల నిర్వహణ ఎలా సాగుతున్నది విద్యార్థుల హాజరు తదితర అంశాలపై ఆరా తీశారు. కరీంనగర్ జిల్లాలో పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా జరుగుతున్నాయని ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని అడిషనల్ కలెక్టర్ పేర్కొన్నారు.


## గాంధీ చౌక్‌లో మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి



మంథని ఏప్రిల్ 13 (మనం న్యూస్);మాజీ స్పీకర్ శ్రీపాదరావు వర్ధంతిని పురస్కరించుకొని మంథని పట్టణం లోని గాంధీ చౌక్ లో మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ కేంద్రాన్ని మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. సోమవారం శ్రీపాద వర్ధంతి సందర్భంగా ఆయన ఈ మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించారు. వేసవికాలంలో మజ్జిగ ద్వారా ప్రజల దాహార్తి తీర్చడం ఎంతో సంతోషకరమని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఒడ్నాల ప్రవల్లిక, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, విద్యుత్ సలహా మండలి సభ్యులు శశి భూషణ్ కాచే,గాంధీ చౌక్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కొమురోజు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ శ్రీపాద రావు సేవలు మరువలేనివి

ఓదెల ఏప్రిల్ 13,(మనం న్యూస్) పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూరు రైల్వే గేట్ సమీపంలో స్వర్గీయ శ్రీపాద రావు 27 వ వర్ధంతి సందర్భంగా పెద్దపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్ శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ, మారుమూల మంథని ప్రాంతంలోని ధన్వాడ గ్రామంలో జన్మించిన శ్రీపాద రావు ధన్వాడ సర్పంచ్‌గా,మంథని సమితి అధ్యక్షుడిగా,మంథని ఎమ్మెల్యేగా ప్రజలకు విశేష సేవలు అందించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా పనిచేసి ఆ పదవికి వన్నె తెచ్చిన గొప్ప నాయకుడని కొనియాడారు.చిన్న పెద్ద తేడా లేకుండా అందరితో కలివిడిగా మెలుగుతూ, అజాతశత్రువుగా పేరు గాంచిన వ్యక్తిగా శ్రీపాద రావు నిలిచారన్నారు.తండ్రికి తగ్గ తనయుడిగా రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు రాజకీయాల్లో రాణిస్తున్నారన్నారు.శ్రీపాద రావు వర్ధంతి సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఆయనకు ఘన నివాళులు అర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగం కొమురయ్య, ఆముల భిక్షపతి,సాతూరి రాజేశం,శంకరయ్య, ఎర్రయ్య,రజినీకాంత్,సత్తయ్య,శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగం భారతదేశానికి దిక్సూచి

కరీంనగర్ రూరల్ ఏప్రిల్ 13(మనం న్యూస్)..రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రూపకర్తగా రూపొందించిన రాజ్యాంగశే దేశానికి దిక్సూచి అయిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. భారతరత్న డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ జయంతి 135 వఉత్సవాలను పురస్కరించుకొని బిజెపి రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపుమేరకు కరీంనగర్లోని స్థానిక రేకుర్తి లో గల అంబేద్కర్ విగ్రహ శుద్ధి , పరిసర ప్రాంతాలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని బిజెపి శ్రేణులు చేపట్టారు. అలాగే హుజురాబాద్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దీపాలను వెలిగించారు. ఆయా కార్యక్రమాలకు బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారత దేశాన్ని లౌకిక, గణతంత్ర, ప్రజాస్వామిక రాజ్యాంగ తీర్చిదిద్దేందుకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అనుసరించిన కార్యచరణ మహోన్నతమైనదన్నారు. ముఖ్యంగా ప్రతి దేశానికి దానికి చట్టాలను రూపొందించిన నాయకులు ఉంటారు కానీ ఆ చట్టాలకు ఎవరు అర్హులు అనే భావనకి రూపమిచ్చిన నాయకులు తక్కువ ఉంటారని, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అటువంటి నాయకుల్లో ఒకరిని అన్నారు. సాధారణమైన వ్యక్తిగత కష్టాలను ఎదురుకొని అంబేద్కర్ రాజ్యాంగానికి ప్రధాన రూపకర్త అయ్యారన్నారు. ముఖ్యంగా అంబేద్కర్ తన జీవితమంతా సమానత్వంతో కూడిన



చట్టపరమైన, నైతిక నిర్మాణాన్ని నిర్మించడంలో గడిపారని తెలిపారు. అంబేద్కర్ దర్శనికత మూలంగానే రాజ్యాంగబద్ధంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బి సాధ్యమైందన్నారు. బాబా సాహెబ్ చూపిన మార్గం లోనే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నడుస్తుందన్నారు. ఆ దిశలోనేబిసబ్బండ వర్గాలకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి వేడుకలు కేవలం ఒక స్మరణ పండుగ మాత్రమే కాదని, ఇది దేశానికి ఒక మైలురాయి లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్స్ సోమిడి వేణు ప్రసాద్ బండ రమణ రెడ్డి ఒంటెల సత్యనారాయణ రెడ్డి పెద్దపల్లి జితేందర్ కర్రె అనిల్ జాడి బాలారెడ్డి శ్రీనివాస్ రెడ్డి లతో పాటు హుజురాబాద్ లో జరిగిన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు, స్థానిక నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాల పరిమితి ముగిసిన డిపాజిట్ డబ్బులు చెల్లించని సహారా ఇండియా

మందమర్రి, ఏప్రిల్ 13 : (మనం న్యూస్ ) కాల పరిమితి ముగిసి ఐదు సంవత్సరాలు గడుస్తున్న తమ డిపాజిట్ డబ్బులు చెల్లించడం లేదని మందమర్రి సహారా ఇండియా కార్యాలయం ముందు నిరసన ధర్నా చేపట్టిన బాధితులు. సోమవారం మందమర్రి సహారా కార్యాలయం ముందు బాధితులు నల్ల బ్యాడ్జీలు, ప్లే కార్డులు ధరించి నిరసన ధర్నాను కొనసాగించారు. తమ డిపాజిట్ కాలపరిమితి ముగిసిందని తమ డిపాజిట్ డబ్బులు వెంటనే చెల్లించాలని నినాదించారు. తమ డబ్బులు వెంటనే చెల్లించాలని లేనియెడల జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని సహారా ఇండియా బాధితులు పేర్కొన్నారు. లక్షలాదిమంది సహారా బాధితుల సమస్యల పరిష్కారం కొరకు జిల్లాలోని ఎంఎల్ఏ లు మరియు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ సమస్య పరిష్కారం కొరకు కృషి చేయాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. ధర్నా అనంతరం సహారా ఇండియా మందమర్రి బ్రాంచి



మేనేజర్ కు వెంటనే డబ్బులు ఇప్పించాలని వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక, మరియు సహారా ఇండియా బాధితులు గజ్జెల్లి వెంకటయ్య, డి రాజమౌళి, రామ్ నరేష్ బాబు,సిహెచ్ సంపత్, ఎస్.మధు,దుర్గశీ మల్లేశ్వరి, బీరి రమాదేవి, దూత లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాసమహర్షి అనుగ్రహమే అష్టాదశ మహాపురాణాలు

కోరుట్ల ఏప్రిల్ 13 (మనం న్యూస్) : మన సంస్కృతి, సంప్రదాయాల పునాది అయిన సనాతన ధర్మాన్ని తరతరాలకు అందించడంలో అష్టాదశ మహాపురాణాల పాత్ర అపారమని, అవన్నీ వ్యాసమహర్షి అనుగ్రహమేనని శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ భావోద్వేగంతో తెలిపారు. సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అష్టాదశ మహాపురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞంలో భాగంగా, కోరుట్ల వాసవి కళ్యాణ భవనంలో సోమవారం "శ్రీ వరాహ మహాపురాణ సప్తాహం" ఘనంగా, ఆధ్యాత్మిక వైభవంతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమ ప్రారంభంలో సమితి అధ్యక్షులు మంచాల జగన్ -- రోజారమణి దంపతులు, పురాణ కమిటీ చైర్మన్, పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు పడిగెల శ్రీనివాస్ -- లతా దంపతులు గురువుల పాదపద్మాలకు వందనం చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రవచనంలో భాగంగా బ్రహ్మశ్రీ మహేశ్వరశర్మ సృష్టి రహస్యాలను, విష్ణుమూర్తి అవతారాల ఆంతర్యాన్ని హృదయాన్ని హత్తుకునేలా వివరించారు. రాక్షసులు భూమిని సముద్ర గర్భంలో దాచిన దుస్థితిలో, భూదేవిని రక్షించేందుకు మహావిష్ణువు వరాహావతారంలో అవతరించారని ఆయన ఆవేశభరితంగా వివరించారు. అంతేకాక, వరాహమూర్తి భూదేవికి ఉపదేశించిన ధర్మసూక్ష్మాలు మన జీవితానికి మార్గదర్శకాలు అని, వాటిని వేదవ్యాస మహర్షి మనకు వరాహ మహాపురాణం ద్వారా అందించారని స్పష్టం చేశారు. ఈ



జ్ఞానయజ్ఞంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఇది కేవలం ఒక కార్యక్రమం కాకుండా, ఆత్మను శుద్ధి చేసే ఆధ్యాత్మిక యాత్రగా మారింది. ఈ పవిత్ర కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి బట్టు హరికృష్ణ, కోశాధికారి రేగుంట రాజారాం, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ చైర్మన్ పడిగెల పవన్ కుమార్, నిర్వాహకులు పిన్నంశెట్టి భానుమూర్తి, బోగ శ్రీధర్, దొంతుల సుందర వరదరాజన్, పొటారి చిన్నరాజన్న, రుద్ర సుధాకర్, శక్కరి వెంకటేశ్వర్, గుండేటి భృగుమహర్షి, కోటగిరి నారాయణ, ఎనుగందుల శ్రీనివాస్, ఎనుగందుల రాజేంద్రప్రసాద్ తదితరులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమం వచ్చే ఆదివారం వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుండి కొనసాగుతుంది. అరుదుగా లభించే ఈ దివ్య సదవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకొని, పెద్ద సంఖ్యలో హాజరై పురాణ ప్రవచనాలను శ్రద్ధగా శ్రవణం చేయాలని నిర్వాహకులు హృదయపూర్వకంగా పిలుపునిచ్చారు.

# వాహనదారులు నిబంధనలు పాటించాలి



భీమారం ఏప్రిల్13 (మనం న్యూస్)మండలములోని,పలు గ్రామ పంచాయతీలలో, సర్పంచ్ ల అధ్యక్షతన అరైవ్ అలైవ్ కార్యక్రమాన్నినిర్వహించడం జరిగింది. ఈ నేపథ్యంలో, భీమారం గ్రామ సర్పంచ్ ఉష్కామల్ల. విజయ లక్ష్మి అధ్యక్షత వహించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో ప్రవర్తిస్తేనే ప్రమాదాలను తగ్గించి సురక్షిత రోడ్డు ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించవచ్చని, రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖ ద్వారా అవగాహన కలిపించడానికి శ్రీకారం చుట్టింది. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని భీమారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో,గ్రామంలో ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో,జైపూర్ ఏసీపీ ఏ. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ మధుసూదన్,ఎమ్ ఈ ఓ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ అంజమ్మ,ఎస్ ఐ ఏ. రాజేందర్ లు హాజరయ్యారు. వాహదారులు సురక్షిత ప్రయాణంతో ప్రాణాలతో ఇంటికి చేరుకోవాలని,రోడ్డు భద్రతపై పోలీసులు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ. ప్రతి ఒక్కరూ ఇంటి నుంచి వాహనం పై బయలుదేరి పని ముగించుకుని మరల తిరిగి ప్రాణాలతో ఇంటికి సురక్షితంగా చేరుకోవాలన్నారు.ఇటీవల జరిగిన పలు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం డ్రైవర్ల నిర్లక్ష్యమేనని,ర్యాష్ డ్రైవింగ్,హెల్మెట్ లేకుండా బైక్ నడపడం,సీట్ బెల్ట్ ధరించకపోవడం,మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, సెల్‌ఫోన్ ఉపయోగించడం వంటి చర్యలు ప్రమాదాలకు దారి తీస్తున్నాయని వాహనదారులు తమ భద్రత కోసం,తమ కుటుంబాల కోసమే ట్రాఫిక్ నియమాలు పాటించాలని కోరారు. పోలీసులు సేకరించిన ప్రమాదాల వివరాలను విశ్లేషించగా,ఎక్కువ ప్రమాదాలకు వాహనదారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని, వెల్లడైందన్నారు.వాహన డ్రైవర్లు సైతం ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, రోడ్ సేఫ్టీ,ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని,రాంగ్ రూట్ డ్రైవింగ్,మద్యం సేవించి వాహనాలు నడపడం,సెల్‌ఫోన్ ఉపయోగించడం వంటి చర్యలను పూర్తిగా నివారించాలని సూచించారు.ప్రజల సహకారం లేకుండా పోలీసుల ప్రయత్నాలు ఫలించవనీ,అందరూ కలిసి పనిచేస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు.పోలీసులు ఈ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గంజాయి రహిత ప్రాంతంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని, తెలిపారు.అనంతరం పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు,యువత,అందరితో రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని,మిగతా వారితో పాటించేలా చేస్తామని,ప్రమాద రహిత మండలముగా ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో,పలు వాహనాల డ్రైవర్ లు, పోలీస్ సిబ్బంది. నాయకులు,ప్రజలు,యువత తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలి




జమ్మికుంట, ఏప్రిల్ 13 (మనం న్యూస్): తెలంగాణ ప్రభుత్వ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం రోడ్ సేఫ్టీ కార్యక్రమంపై జమ్మికుంట మండలం పాపక్కపల్లి గ్రామంలో సర్పంచ్ గాజనవేణి లక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి నరేందర్ రెడ్డి, వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటరు మోహన్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ రోడ్ భద్రతా నియమాలు పాటించి ప్రాణ నష్టం జరుగకుండా చూసుకోవాలన్నారు. ఎండ తీవ్రతలు ఎక్కువగా ఉండటం వల్ల వడ దెబ్బపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వడ దెబ్బ లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలను క్లుప్తంగా వివరించారు. రోడ్ సేఫ్టీ భద్రత నియమాలపై ప్రతిజ్ఞ చేపించినారు. అనంతరం గ్రామపంచాయతీ పాలకవర్గం మరియు గ్రామస్తులు, యువత అందరూ కలిసి గ్రామంలో హెల్మెట్ ధరించి - వాహనం నడపండి. అతివేగం వద్దు - జీవితం ముద్దు. మద్యం సేవించి - వాహనం నడపద్దు. సీట్ బెల్ట్ ధరించి - ప్రాణాన్ని రక్షించుకో వంటి నినాదాలతో పాపక్కపల్లి పుర వీదులలో రోడ్ సేఫ్టీ పై ర్యాలీ ని నిర్వహించారు. గ్రామ సభ నిర్వహించి, గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పుట్టకొక్కుల రాజు, వార్డ్ సభ్యులు, ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్త, అంగన్వాడీ టీచర్, గ్రామైక్య సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అడవిలో నీటి వసతుల పరిశీలన



కాసిపేట, ఏప్రిల్ 13(మనంన్యూస్)కాసిపేట మండలం ముత్యంపల్లి అటవీ సెక్షన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో, వేసవి కాలం సందర్భంగా వన్యప్రాణులు దాహం తీర్చుకునేందుకు ఏర్పాటు చేసిన నీటి సౌకర్యాలను సోమవారం బెల్లంపల్లి ఎఫ్ డి ఓ విజయ్ కుమార్, సిబ్బందితో కలిసి పరిశీలించారు. అటవి ప్రాంతం లో తిరుగుతూ నీటి ఏర్పాట్లు చెక్ డ్యామ్ లు, నీటి కుంటలు, సహజసిద్ధమైన నీటి ఊటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్, అధికారులకు పలు సూచనలు చేశారు. అటవీ ప్రాంతం రక్షణకై పాటుపడాలని,పశువులను అటవీ ప్రాంతంలోనికి రాకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లోనే, గ్రామ పశువులకు, నీటి వసతికై గ్రామ పంచాయతీ అధికారులతో, మాట్లాడి చర్యలు తీసుకునెట్టు చూడాలనిలని సూచించారు. అటవి ప్రాంతం నుండి ఎవైనా వన్య ప్రాణులు ,దాహర్తి తీర్చుకోవడం కోసం, గ్రామాల్లో వస్తే అటవీ అధికారులకు సమాచారం అందించేట్టు, వన్య ప్రాణుల వేట గురించి నిఘా పెట్టడం, సమాచార వ్యవస్థ పెంచుకోవడం,గ్రామాల్లో అటవీ లో నిప్పు పెట్టకుండా, గ్రామ సభలలో అవగాహన కల్పించాలని అధికారులకు మౌఖిక ఆదేశాలిచ్చారు. ఈ పర్యటనలో బెల్లంపల్లి అటవీ క్షేత్రాధికారి పూర్ణచందర్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బి. ప్రవీణ్ నాయక్, ఎఫ్బిఓ శ్రీధర్ లు పాల్గొన్నారు.

# 'ప్రజావాణి' దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి



కరీంనగర్, ఏప్రిల్ 13(మనం న్యూస్)..ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 229 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు.

# జిల్లా పాలనాధికారి ఆదేశానుసారం రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు





కోరుట్ల ఏప్రిల్ 13 (మనం న్యూస్) జగిత్యాల జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం కథలాపూర్ మండలం తాండ్రియాల్ గ్రామంలో "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో ఎంపీడీవో ఎం. శంకర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవి, ఆర్అండ్‌బీ, ఆరోగ్యశాఖల అధికారులు మరియు గ్రామపంచాయతీ సర్పంచ్ జంగ శివాని- రంజిత్, ఉపసర్పంచ్ అల్లూరి జనార్ధన్ రెడ్డి, వార్డ్ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమంలో బిటి రోడ్లు, స్థానిక రహదారులపై బ్లాక్ స్పాట్ లు, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు సమష్టిగా అవసరమైన నివారణ చర్యలు చేపట్టారు, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. గ్రామస్తుల సహకారంతో కొన్ని చోట్ల గుంతలు కూడా పూడ్చినామని కథలాపూర్ ఎస్సై రవికిరణ్ తెలియజేసినారు.

# పోషక ఆహారంపై తల్లులకు అవగాహన

మెట్ పల్లి ఏప్రిల్ 13 ( మనం న్యూస్) పోషణ్ పక్వాడ కార్యక్రమంలో పోషకాహారం పై తల్లులకు అవగాహన కల్పించినట్లు. ఐసిడిఎస్ సూపర్వైజర్ షమీం సుల్తానా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని వేంపేట గ్రామంలో సోమవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించామన్నారు. పోషకాహారం పై తల్లులకు అవగాహన కల్పించినట్లు ఆమె తెలిపారు. స్థానికంగా దొరికే వివిధ ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువ మోతాదులో తీసుకోవాలని, బాలామృతం, బాలామృతం ప్లస్ ఉపయోగాలు వివరించామన్నారు.బాలమృతంతో కొన్ని రకాల వంటలు చేసి ప్రదర్శించారు. ప్రీస్కూల్ హాజరు శాతం పెంచాలని గ్రామస్తులను కోరినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్, ఉప సర్పంచ్ అల్లూరి సురేందర్ రెడ్డి, మరియు గ్రామ వార్డు మెంబర్లు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు జయలక్ష్మి, అరుణ, గంగాజల, రాజేశ్వరి తదితరులు న్నారు.



## బీఆర్ఎస్ జెండాల తొలగింపుపై భగ్గుమన్న గులాబీ శ్రేణులు



జైపూర్,ఏప్రిల్ :13(మనం న్యూస్): మంచిర్యాల జిల్లాలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరైన సందర్భంగా, పార్టీ జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ ఆదేశాల మేరకు ఇందారం బస్టాండ్ ఏరియాలో ఏర్పాటు చేసిన జెండాలను, తోరణాలను ఇందారం సర్పంచ్ ఫయాజ్ ఆధ్వర్యంలో తొలగించడం తీవ్ర దుమారం రేపింది.గులాబీ జెండాను చూస్తేనే కాంగ్రెస్ పెద్దలు గడగడ వణికిపోతున్నారని, అందుకే అక్రమంగా జెండాలను తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ నాయకులు అరికె సంతోష్ యాదవ్, మహమ్మద్ అమీర్, గండు సత్యనారాయణ, తుంగపిండి శేఖర్ తదితరులు జెండాలను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకుని అక్కడికక్కడే భారీ నిరసన చేపట్టారు. అధికార మదంతో ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నాలు చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వ ఆగడాలను అడ్డుకుంటామని ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రస్థాయిలో హెచ్చరించాయి.

## రైలు సర్వీసును పునరుద్ధరణ చేయాలని వినతి





రాయికల్, ఏప్రిల్ 13(మనం న్యూస్) : వేసవి కాలంలో సెలవుల దృశ్య ముంబాయి నుంచి కరీంనగర్,నిజామాబాద్ కు గత సంవత్సరం వారం వారం ఇదే సమయంలో నడిపిన ప్రత్యేక రైలు పునరుద్ధరణ కోసం ముంబయి వర్లి అరతి క్రీడా మండలి ఛైర్మన్ చావ పరమేశ్వర్ కరీంనగర్ మరియు నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్,ధర్మపురి అరవింద్ లను విడి విడి గా కలిసి వినతి పత్రాలను ఇచ్చారు. ఆయన వెంట మల్యాల సర్పంచి జయ ప్రసాద్ మరియు మైతాపూర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు అనుమల్ల రమ సత్యనారాయణ,బుస గంగ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

## ఆసరా పెన్షన్లను నిలిపివేస్తున్న బ్యాంకర్లపై చర్యలు తీసుకోవాలి



కరీంనగర్ ఏప్రిల్ 13(మనం న్యూస్) : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లబ్ధిదారుల ఆసరా పెన్షన్లను నిలిపివేస్తున్న బ్యాంకర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణతో కలిసి ఆయన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ బ్యాంకర్ల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న రుణాలను పెన్షనర్ల ఖాతాలకు బదిలీ చేయడం నిబంధనలకు విరుద్ధం అని ఆసరా పెన్షన్ దారులు ఇతర కుటుంబ సభ్యులు తీసుకున్న లోన్లకు పెన్షనర్లను బాధ్యులను చేస్తూ వారి ఖాతాలను 'ఫ్రీజ్' చేయడం అన్యాయం అన్నారు. దీనివల్ల వృద్ధులు, వికలాంగులు, వితంతువులు కనీసం మందులు, ఆహారం కొనుక్కోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. జిల్లావ్యాప్తంగా బ్యాంకర్లు నిలిపివేసిన పెన్షన్ ఖాతాలను గుర్తించి, వాటిని వెంటనే పునరుద్ధరించడానికి ప్రత్యేక 'డ్రైవ్' నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పెన్షన్ ఖాతాలను నిలిపివేయవద్దని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. బీజేపీ నాయకుల చొరవతో కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో, కరీంనగర్ జిల్లావ్యాప్తంగా నిలిచిపోయిన వేలాది మంది పెన్షన్లు తిరిగి పంపిణీ కానున్నాయి. పెన్షనర్ల సమస్యపై స్పందించి పోరాడిన రాగంపేట మాజీ ఎంపీటీసీ సింగిరెడ్డి కృష్ణారెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి మార్కులతో అన్ని విభాగాల్లో అల్ఫోర్స్ జయకేతనం




కరీంనగర్ ఏప్రిల్ 13(మనం బ్యూరో)..ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియట్ ప్రథమ మరియు ద్వితీయ సంవత్సర ఫలితాలలో ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలకు చెందిన వివిధ విభాగాల విద్యార్థిని విద్యార్థులు తెలంగాణ రాష్ట్రస్థాయి అత్యుత్తమ మార్కులను సాధించారు.సీనియర్ ఇంటర్మీడియట్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు కె. పల్లవి 996 జి. హైందవి 996 డి. ప్రణవి 996 వై శ్రీ నిత్య 996 రాష్ట్రములో అత్యున్నత స్థానంలో నిలిచారు. 15 మంది విద్యార్థులు 995 ఆపై మార్కులు, 202 మంది విద్యార్థులు 990 ఆపైన మార్కులు సాధించడం విశేషం.

సీనియర్ ఇంటర్మీడియట్ బైపిసి విభాగంలో 1000 మార్కులకు గాను అర్. వైష్ణవి 995 కె.హారిక 995,నభిలాతాహేన్ 995, ఎస్. బ్రహ్మణి 995, ఎస్ ఐశ్వర్య 995 మార్కులు సాధించి రాష్ట్రములో అగ్రగామిగా నిలవడం జరిగింది. 38 మంది విద్యార్థులు 990 మరియు అపై మార్కులు సాధించడం విశేషం.

ఎంఈసి . విభాగంలోను 1000 మార్కులకు గాను కె. మానస 988, మార్కులు సాధించారు. 970 మరియు అపై మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య 04.

సి ఈ సి . నిభాగంలోను 1000 మార్కులకు గాను పి. బావోజ్ఞ 987 మార్కులు సాధించారు. 970 మరియు అపై మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య 18.

జూనియర్ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ . విభాగంలో 470 మార్కులకు గాను డి. వినిష 469, జి. అక్షర 469 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానములో నిలిచారు. 61 మంది విద్యార్థులు 468 అపై మార్కులు, 176 మంది విద్యార్థులు 467 అపై మార్కులు సాధించి అల్ఫోర్స్ ఖ్యాతిని దశదిశలా చాటారు.

బైపిసి . విభాగంలో 440 మార్కులకు గాను ఎస్. జాగృతి 439, ఏ. హస్విత 439, ఖాన్సా అలియా 439,జి. కావ్యశ్రీ 439 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానము సాధించడము విశేషం. 20 మంది విద్యార్థులు 438 అపై మార్కులు సాధించారు. 46 మంది విద్యార్థులు 437 అపై మార్కులు సాధించారు. 77 మంది విద్యార్థులు 436 అపై మార్కులు సాధించారు.

ఎం ఈ సి . విభాగంలో 500 మార్కులకు గాను ఏమ్. మహాలక్ష్మి 493, మార్కులు, మరియు సి ఈ సి . విభాగంలో 500 మార్కులకు గాను వి. దీక్షిత 494, అనామ్మఫ్రూజ్ 494 మార్కులు సాధించారు.

విద్యార్థులకు అత్యుత్తమ విద్యద్వారా సంచలనాత్మక విజయాలను నమోదు చేయవచ్చని నాణ్యమైన భోధన ద్వారా అద్భుతాలు సృషించవచ్చు దానికి నిదర్శనం నేటి ఇంటర్మీడియట్ ప్రథమ మరియు ద్వితీయ సంవత్సర ఫలితాలే అని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను. ఇటీవల ప్రకటించబడిన ఐ.ఐ.టి మెయిన్ ఫలితాలలో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుతంగా రాణించారని, రాబోయే నీట్ మరియు ఎమ్సెట్ ఫలితాలలో కూడ అఖండ విజయం సాధిస్తారని నా ప్రగాఢ విశ్వాసం. పటిష్ట ప్రణాళికతో విద్యాభోధన, పర్యవేక్షణ మరియు విద్యార్థుల నిరంతర కృషి వల్ల ఇంతటి ఘనవిజయం సాధించడం జరిగింది. ఇంటర్ ఫలితాలలో అద్భుత మార్కులు సాధించిన మా ఆల్ఫోర్స్ అణిముత్యాలను మరియు వారి తల్లిదండ్రులను మన స్ఫూర్తిగా అభినందించారు.

## బాలికలకు హెచ్‌పీవీ టీకాతో రక్షణ



గంగాధర, ఏప్రిల్ 13, ( మనం న్యూస్ ):14 - 15 సంవత్సరాల వయస్సుగల బాలికలు హెచ్‌పీవీ టీకా వేసుకుంటే భవిష్యత్తులో గర్భాశయ ముఖ క్యాన్సర్ రాకుండా నియంత్రించవచ్చని గంగాధర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ శ్వేత, డాక్టర్ సౌమ్య, పేర్కొన్నారు. సోమవారం గంగాధర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టి జి ఎం ఎస్ పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థినీలకు అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు గర్భాశయ క్యాన్సర్ నివార ణకు హ్యూమెన్ పాపిలోమ వైరస్ (హెచ్‌పీవీ) ప్రభుత్వ టీకాను ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్వేత మాట్లాడుతూ ఈ టీకాను అన్ని విధాలా పరీక్షలు జరిపి కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందన్నారు. విద్యార్థినుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని, భవిష్యత్తులో తీవ్రమైన వ్యాధులను నివారించేందుకు ఈ టీకా కార్యక్రమం నిర్వహించబడిందని అన్నారు. గంగాధర మండలంలోని అన్ని హై స్కూల్స్, కేజీబీవీ గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ విద్యార్థినులకు సెలవులకు వెళ్లే ముందు తప్పనిసరిగా హెచ్ పి వి టీకాలు వేయించవలసిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎ. పద్మ, మండల విద్యాధికారి శ్రీ ప్రభాకర్ రావు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## 3వ రోజుకు చేరిన ప్రవేట్ సెక్యూరిటీ గార్డుల నిరసన పోరాటం

మందమర్రి, ఏప్రిల్ 13 :(మనం న్యూస్) భిక్షటనతో నిరసన పోరాటం మూడో రోజుకు చేరిందని, తమకు ప్రజల మద్దతు లభిస్తుందని సి ఐ టీ యు అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ అన్నారు. సోమవారం మందమర్రి ఏరియాలో తొలగించిన ప్రవేట్ సెక్యూరిటీ గార్డులను వెంటనే పనిలోకి తీసుకోవాలని చేపట్టిన నిరసన పోరాటం మందమర్రి మార్కెట్ లో భిక్షాటనతో మూడో రోజు చేరిందని ఆయన అన్నారు.నవ్విపోదురు గాక నాకేమీ అన్న చందాన సింగరేణి యాజమాన్యం వ్యవహరిస్తుందని ఆయన దుయ్యబట్టారు. తమ భూములు లాక్కున్నారని, తమ వయస్సును లాక్కున్నారని, తమ రక్తాన్ని చెమటగా మార్చి గత 12 సంవత్సరాలుగా సింగరేణి ఆస్తులను కాపాడిన తమను రోడ్ పైకి ఈడ్చారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.220 కుటుంబాలు ఈరోజు వీధిన పడ్డాయని అనేక ఆర్థిక ఇబ్బందులతో సతమవుతమవుతున్నారని తమ బాధను వ్యక్తం చేశారు. చెన్నూరు ఎమ్మెల్యే కార్మిక శాఖ మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి ఈ విషయంలో కలగచేసుకుని సింగరేణి యజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. వెంటనే ప్రవేట్ సెక్యూరిటీ గార్డులను ఉ ద్యోగంలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు లేనట్లయితే తమ నిరసన పోరాటం రూపాంతరం చెందుతుందని వారు హెచ్చరించారు.



# రోడ్డు ప్రమాద బాధితులను కాపాడితే రూ,1,25 లక్షల నజరానా



శంకరపట్నం ఏప్రిల్ 13 మనం న్యూస్).. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడే వ్యక్తులకు ప్రభుత్వం భారీగా నగదు ప్రోత్సాహకాలు అందిస్తుందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ప్రకటించారు. సోమవారం శంకరపట్నం మండలం మొలంగూర్ మరియు నల్లవెంకయ్యపల్లె గ్రామాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రమాద బాధితులను కాపాడే వారికి బహుమతులు ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ.. "ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి బాధితులను కాపాడే 'గుడ్ సమారిటన్'లకు ప్రభుత్వం గుర్తింపునిస్తుంది. ఒక్క రోడ్డు ప్రమాదంలో సేవలందించిన వారికి రూ. 25 వేలు, అలాగే ఏడాది కాలంలో ఐదుసార్లు ప్రమాదాల్లో గాయపడిన వారిని కాపాడిన వారికి రూ. 1.25 లక్షల నగదు బహుమతితో పాటు ప్రత్యేక సన్మానం చేస్తాము ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలి" ప్రజా పాలనలో భాగంగా ప్రజల రక్షణ కోసం పోలీసు శాఖ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసిందని సీపీ తెలిపారు. గ్రామాల వారీగా రోడ్డు భద్రతపై వీడియోలను ప్రదర్శిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి వాహనదారుడు సీటు బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, రహదారి నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని ఆయన సూచించారు. కేశవపట్నం ఎస్సై కట్కూరి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వాహనదారులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. పలువురు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను, డ్రైవర్లకు దుస్తులను పంపిణీ చేశారు. నిబంధనలు పాటించిన వ్యక్తులను, సర్పంచులను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఏసీపీ వి. మాధవి, రూరల్ సిఐ పులి వెంకట్, మొలంగూర్ సర్పంచ్ పూదరి రాజు, నల్లవెంకయ్యపల్లె సర్పంచ్ మేడుదుల నాగలక్ష్మి ఐలయ్య, ఇతర ప్రజాప్రతినిధులు, సిఐలు, ఎస్సైలు, వాహనదారులు పాల్గొన్నారు.

# మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ లు చారిత్రక నిర్ణయం



కరీంనగర్ ఏప్రిల్ 13(మనం బ్యూరో)...భారత దేశ రాజకీయాలలో మహిళా భాగా,స్వామ్యాన్ని పెంచే మహత్తర సంస్కరణకు సమయం ఆసన్నమైందని, దశాబ్దాల నిరీక్షణకు విముక్తి కల్పిస్తూ మహిళలకు పట్టం కట్టి పట్టాభిషేకం చేసే కార్యక్రమానికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు , కార్పొరేటర్ చొప్పరి జయ శ్రీ అన్నారు. సోమవారం కరీంనగర్ లోని పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో చొప్పరి జై శ్రీ మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే నారి శక్తి వందన్ అధి నియం బిల్లును ఏప్రిల్ 16న పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో ప్రవేశపెట్టడం హర్షనీయమన్నారు. మహిళలకు 33 శాతం చట్టసభల్లో రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తూ మోడీ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు.గత కాంగ్రెస్ పార్టీ మహిళలను రాజకీయ అవసరాలకే వాడుకుందని, మహిళలకు కాంగ్రెస్ రాజకీయంగా ప్రాతినిధ్యం కల్పించడానికి ఏ నాడు ఆలోచన చేసిన పాపాన పోలేదన్నారు. దశాబ్దాలు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ మహిళలకు చట్టసభల్లో హక్కులు కల్పించలేక పోయిందని , భారతీయ జనతా పార్టీ ప్రభుత్వమాత్రం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లకు శ్రీకారం చుట్టి ఒక నూతన ఒరవడికి మార్గం చూపిందన్నారు. దీంతో మహిళలు నిర్ణయాత్మక శక్తిగా మారే అవకాశం ఉందని తెలిపారు.

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మహిళల సంక్షేమం అభివృద్ధి కోసం ఎంతో చిత్తశుద్ధి తో పనిచేస్తుందన్నారు. దేశాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కూడా కీలకంగా మారిందని , ఆదిశ లోనే మోడీ సర్కార్ దశాబ్ద కాలాలుగా మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని , చేతల ప్రభుత్వమని విశ్వాసం మహిళల్లోకి బలంగా వెళ్ళిందన్నారు. 2029 ఎన్నికలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే లక్ష్యంతో, భారీ ఎత్తున చట్టసభలలో అవకాశం కల్పించాలనే సంకల్పంతో బిజెపి ప్రభుత్వం ముందు కొనసాగుతుందన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి



జమ్మికుంట, ఏప్రిల్ 13 (మనం న్యూస్): ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని జమ్మికుంట మున్సిపల్ ఛైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అన్నారు. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ ఉ పీజీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. రమేష్ అధ్యక్షతన వచ్చే విద్యా సంవత్సరం 2026-27 డిగ్రీ అడ్మీషన్ల వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం చేపట్టిన అడ్మీషన్ 2026-27 ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ... జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో చాలా అనుభవం, అర్హత గల అధ్యాపకులు ఉన్నారన్నారు. కళాశాలలో డిజిటల్ లైబ్రరీ, ఆధునిక కంప్యూటర్ ల్యాబ్, నూతన కోర్సులతో పాటు విద్యార్థులకు ఉపాధి కల్పిస్తున్న తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఉన్నాయన్నారు. విశాలమైన క్రీడా మైదానం, మౌలిక వసతులు ఉన్నాయన్నారు, విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరు వసతి గృహాలున్నాయన్నారు. ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకులు అందించే మెరుగైనా భోదనను, కళాశాల సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జమ్మికుంట పట్టణంతో పాటు చుట్టు పక్కనున్న మండలాలలోని గ్రామాల విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలన్నారు. అనంతరం కళాశాల నుండి విద్యార్థులు నినాదాలు చేస్తూ ప్రధాన రహదారి వరకు ర్యాలీని కొనసాగించారు. ప్రభుత్వ కళాశాలలో చేరాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే డిగ్రీ చదవడం ఉత్తమమని విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. ఎస్. ఓదెలు కుమార్, అకాడమిక్ కో ఆర్డినేటర్ డా. కె. రాజేంద్రం, డా. కె. గణేష్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ తిరస్కరించిందని..

కాసిపేట, ఏప్రిల్ 13(మనంన్యూస్)కాసిపేట మండలం రొట్టెపెల్లి గ్రామ పంచాయతీ సుంగు పంతులు గూడెం కు చెందిన సుర్పం కార్తీక్ (18సం) అనే యువకుడు, తన ప్రేమను అమ్మాయి తిరస్కరించిందనే బాధతో పురుగుల మందు సేవించి బలవన్మరణం పొందాడు. కార్తీక్ తండ్రి రామకృష్ణ పోలీసులకు యిచ్చిన ఫిర్యాదులో ఆత్మహత్య కు గల కారణాలను తెలియచేశారు. సమీప గ్రామానికి చెందిన ఒక అమ్మాయి ప్రేమలో పడిన కార్తీక్, తనతో మాట్లాడడం లేదని, ప్రేమను తిరస్కరించినదనే కారణంతో ఆదివారం రాత్రి గుర్తు తెలియని పురుగుల మందు తాగాడని, గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించామని, వైద్య చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు తీసుకున్న దేవాపూర్ ఎస్సై గంగారాం కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

# రోడ్ సేఫ్టీపై ప్రజలకు అవగాహన



గంగాధర, ఏప్రిల్ 13, ( మనం న్యూస్ ): గంగాధర మండలం పలు గ్రామాలలో రోడ్డు సేఫ్టీ పై గ్రామస్తులకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండలంలోని మధురానగర్ లో చొప్పదండి సిఐ ప్రదీప్ కుమార్ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు జరగడానికి ప్రధాన కారణం ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడమేనని పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వేముల భాస్కర్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# నెన్నెల మండలంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పర్యటన

**- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం**

నెన్నెల, ఏప్రిల్ 13 (మనం న్యూస్): బెల్లంపల్లి ఎమ్మెల్యే శ్రీ గడ్డం వినోద్ వెంకటస్వామి గారు సోమవారం నెన్నెల మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు, సంక్షేమ పథకాల లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షల వ్యయంతో నిర్మించుకున్న మిట్ట రామక్క--బుచ్చయ్యల నూతన గృహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కుమ్మరివాడలో త్రాగునీటి ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే, తక్షణమే నూతన బోరు మోటార్ మంజూరు చేశారు. అనంతరం బోరు పనులకు శంకుస్థాపన చేశారు. మాజీ సర్పంచ్ తోట సుజాత--శ్రీనివాస్ దంపతులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. జంగిలి కైలాస్ ఇంటి నుండి ఇరుసుల్ల సులోచన ఇంటి వరకు రూ.5 లక్షల డియంయఫ్టి నిధులతో నిర్మించనున్న సి.సి. రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. అల్లంపల్లి అనూష--సంజయ్ గార్లకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ పనులను కొబ్బరికాయ కొట్టి పర్యవేక్షించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 59 మంది లబ్ధిదారులకు రూ. 59,06,844 విలువైన కళ్యాణ లక్ష్మీ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. నెన్నెల మండల అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు మీడియా ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# రోడ్డు భద్రతపై గ్రామసభ



మెట్ పల్లి ఏప్రిల్ 13 (మనం న్యూస్) ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమము లో భాగంగా. మండలం లోని వెల్లుల గ్రామంలో గల గ్రామపంచాయతీ లో రోడ్డు భద్రత పై గ్రామసభ నిర్వహించినట్లు. వెల్లుల్ల గ్రామ సర్పంచ్ గూడూరు తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతపై గ్రామ ప్రజలకు పోలీసులు అవాగహన కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో సి ఐ అనిల్, ఎస్ ఐ లు . కిరణ్ కుమార్. గంగాధర్. గ్రామ కార్యదర్శి నారాయణ, మెడికల్ ఆఫిసర్ అజిత్ రెడ్డి. ఆర్ ఐ. కాంత్తయ్య. ఉప సర్పంచ్ రాజా శేఖర్. వార్డు మెంబర్స్ రాజారెడ్డి. భూమేష్.రాజు. మరియు అంగన్వాడీ టీచర్స్. ఆశ వర్కర్స్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# "హామీలు ఎక్కడ...? మహిళల గర్జనతో ఎమ్మెల్యేకు షాక్!"



తాండూర్ ఏప్రిల్ 13 (మనం న్యూస్) : తాండూర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం రాత్రి నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. ముఖ్య అతిథిగా హాజరైన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామిని మహిళలు నేరుగా ప్రశ్నిస్తూ హామీలపై గట్టిగా నిలదీశారు."మాకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? తులం బంగారం ఎక్కడ? మహిళలకు ఇస్తామన్న 2,500 ఎక్కడ?" అంటూ మహిళలు సభ మధ్యలోనే గళమెత్తారు. తాండూరుకు చెందిన మంచెర్ల పోచమల్లు, కిష్టంపేట గ్రామానికి చెందిన శాలిగామా పద్మ ముందుండి ప్రశ్నల వర్షం కురిపించారు.ఈ ఆకస్మిక నిరసనతో కార్యక్రమంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మహిళల ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది.తరువాత కొందరు స్థానిక నాయకులు మహిళలను ప్రశ్నిస్తూ, "మిమ్మల్ని ఎవరు పంపించారు?" అని గద్దించడంతో పాటు, పథకాలు రద్దు చేస్తామంటూ బెదిరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, మాట తప్పకూడదని మహిళలు స్పష్టం చేశారు. ఈ ఘటనతో తాండూర్‌లో రాజకీయంగా చర్చలు మళ్లీ వేడెక్కాయి.

# సింగరేణి కార్మికుల హక్కులపై ఘాటు విమర్శలు

తాండూర్ ఏప్రిల్ 13 (మనం న్యూస్) : కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో సింగరేణిలో టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉన్న కాలంలో దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థలో లేనటువంటి హక్కులను సింగరేణి కార్మికులకు అందజేశామని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు తెలిపారు. టీబీజీకేఎస్ హయాంలో సాధించిన కార్మిక హక్కులను తెలియజేస్తూ కరపత్రాలను ముద్రించి బెల్లంపల్లి ఏరియా తాండూర్ మండలంలోని ఏరియా స్టోర్, వర్క్ షాప్‌లలో సోమవారం కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా సింగరేణిలో గెలిచిన ఏఐటీయూసీ మరియు రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు కొత్తగా ఒక్క హక్కు కూడా సాధించలేదని విమర్శించారు. అంతేకాకుండా, కేసీఆర్ ప్రభుత్వం మరియు టీబీజీకేఎస్ సాధించిన తండ్రి–కొడుకుల ఉద్యోగాల పద్ధతిని నిలిపివేసినట్లు తెలిపారు. అదేవిధంగా, గత సంవత్సరం నుంచి మెడికల్ బోర్డు నిర్వహణ నిలిచిపోయిందని, ఇది కార్మికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన 250 గజాల ఇంటి స్థలం మరియు 45 హామీలను మర్చిపోయిందని ఆరోపిస్తూ, వెంటనే వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ధరావత్ మంగీలాల్, ఏరియా నాయకులు రమేష్, వెంకటేష్, పిట్ కార్యదర్శి గణపతి, ఏరియా వర్క్ షాప్ పిట్ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# చాయ్‌కైనా, బతుకుకైనా కరీంనగరమే

## వలసపోవడానికి నేను అవకాశవాదిని కాదు, రేవంత్ రెడ్డిని అంతకంటే కాదు....

## నా తుది శ్వాస వరకు బీజేపీలోనే ఉంటా...

## నేను చనిపోతే నా శవంపై కప్పేది కాషాయ జెండానే...

## వలసవాది, అవకాశవాదానికి ప్రతిరూపం రేవంత్ రెడ్డి...



కరీంనగర్ ఏప్రిల్ 13(మనం బ్యూరో)...బండి సంజయ్ సైతం డాక్టర్ లక్ష్మణ్ మాదిరిగా ఏదో ఒక రాష్ట్రానికి వలస పోక తప్పదంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ధీటుగా సమాధానమిచ్చారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. "వలసపోవడానికి నేను అవకాశవాదిని కాదు. రేవంత్ రెడ్డిని అంతకంటే కాదు. చాయ్‌కైనా బతుకుకైనా కరీంనగరంతోనే... నా రక్తం కాషాయమే. నేను చనిపోతే నా శవంపై కప్పేది కూడా కాషాయ జెండానే. ఆ సన్నివేశం చూడటానికైనా రేవంత్ రెడ్డి నిండు నూరేళ్లు బతికి ఉండాలని కోరుకుంటున్నా"అని ప్రకటన లో పేర్కొన్నారు. సీఎం వలసపోవడానికి నేను అవకాశవాదిని కాదు. రేవంత్ రెడ్డిని అంతకంటే కాదు. నా తుది శ్వాస వరకు బీజేపీలోనే ఉంటా. నేను చనిపోతే నా శవంపై కప్పేది కాషాయ జెండానే. ఆ సన్నివేశం చూడటానికైనా మీరు నిండు నూరేళ్లు బతికి ఉండాలని కోరుకుంటున్నా. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లులతో జరిగే నష్టమేమిటో చెప్పే దమ్ములేక రాజకీయం చేయాలనుకుంటున్నారా? డీలిమిటేషన్ లో భాగంగా ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్లు పెంచితే దక్షిణాదికి జరిగే నష్టమేంది. ప్రజల్లో లేనిపోని భయాందోళనలు సృష్టించి విభజించాలనుకుంటున్నారా? అసలు.... మీరు చెప్పే శాస్త్రీయత ఏమిటి?. డబ్బు సమకూర్చే వాళ్లకే ప్రాధాన్యత ఇవ్వాలని చెబుతున్నారా?. డబ్బుకు, ఓటుకు, సీటుకు లింకు పెడతారా? లక్ష కోట్లు ఉన్న మీ కుటుంబానికి లక్ష ఓట్లు ఇవ్వాలా? డబ్బులేని పేదవాడికి ఓటు హక్కు కల్పించొద్దా?.

మీ లెక్క ప్రకారం...ముంబయికి, ఢిల్లీకి మాత్రమే అత్యధిక సీట్లు ఉండాలా?. వెనుకబడ్డ ఆదిలాబాద్, పాలమూరు జిల్లాలకు సీట్లు పెంచాల్సిన అవసరమే లేదా?. మీ హైబ్రిడ్ మోడల్ అంటే.... మీలాగే, కాంగ్రెస్ పార్టీలాగే దోచుకునే వాళ్లకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలా?.మీ పార్టీ సిద్ధాంతం ప్రకారం....అంబేద్కర్ రాజ్యాంగాన్ని నమ్ముకున్న మనిషికి విలువ లేదా?. కనీసం మనిషిగా కూడా ఆలోచించలేని స్థాయికి దిగజారుతున్నావా?. కాంగ్రెస్ పార్టీ మిమ్ముల్ని మనీ(ర) మనిషిగా మార్చిందా?. మీలో ఏ మాత్రం మానవత్వం ఉన్నా.....నిజం మాట్లాడండి. అంతెందుకు.....ఇప్పుడు దక్షిణాది లో ఎన్ని సీట్లు ఉన్నాయి ... ఇది చేసింది మీ పార్టీ నే కదా?. అయినా....ప్రతీది రాజకీయం చేయడం తప్ప మనిషిగా ఆలోచించే తత్వమే మీకు లేదా?. విభజన అనేది మీ పార్టీ డీఎన్ఏ లోనే ఉన్నట్లు ఉంది. విభజించు పాలించు అనే బ్రిటీష్ సిద్ధాంతాన్ని ఒంట బట్టించుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంతకంటే ఏం చెప్పగలరు? రాసుకోవడానికి పేపర్లు, చూసుకోవడానికి టీవీలుంటే సరిపోతుందా?. నేను సవాల్ చేస్తున్నా.....ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్లు పెంచితే దక్షిణాదికి జరిగే నష్టమేంటి?. జనాభా ప్రాతిపదికన మాత్రమే డీలిమిటేషన్ చేయాలని చెబుతున్నారా?. యూపీఏ సర్కార్ చెప్పిన ఏపీ పునర్విభజన యాక్ట్ ప్రకారం తెలంగాణలో అసెంబ్లీ సీట్ల సంఖ్యను 119 నుండి 153కు మాత్రమే పరిమితం చేయాలా? మీరు చెప్పిన ఆర్థిక (జీఎస్డీపీ) సూత్రం ప్రకారమే డీలిమిటేషన్ చేయాలా?. మీ లెక్క ప్రకారం.... ఈ దేశంలో ఎవరికి ఎన్ని లక్షల కోట్ల ఆస్తి ఉంటే... అన్ని లక్షల ఓట్లు ఇవ్వాలా? తెలంగాణసహా ఈ దేశంలో దళితుడికి, బడుగు, బలహీన వర్గాలకు..... ఇంకా చెప్పాలంటే పేదవాడికి(బీపీఎల్ కుటుంబానికి) ఓటు హక్కే ఇవ్వకూడదా? అసలు... మీరు సీఎంగా ఉంటూ మాట్లాడుతున్నారా? లేక హైకమాండ్ కు కంచన్ గా మూటలు అప్పజెప్పే క్రమశిక్షణ కలిగిన వ్యాపార, వాణిజ్య నాయకుడిగా మాట్లాడుతున్నారా?

రేవంత్ రెడ్డి ఈ దేశానికి రక్ష, దక్ష డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగమే కదా? రేపు అంబేద్కర్ జయంతి కదా... పుట్టిన రోజే అంబేద్కర్ సిద్ధాంతాలను చంపేయాలని చూస్తున్నారా? అంబేద్కర్ బతికినంత కాలం కాంగ్రెస్ పార్టీ ఆయనను అడుగడుగునా అవమానించింది సరిపోలేదనుకుంటున్నారా? కనీసం అంబేద్కర్ రాజ్యాంగంలో ఓటు హక్కు గురించి... డీలిమిటేషన్ గురించి ఏమి రాశారో కూడా చదవలేని స్థితిలో ఉన్నారా? హైకమాండ్ కు మూటలు పంపే టెన్షన్ లో తెలిసి కూడా తెలియనట్లు ఉన్నారా అని అన్నారు.

# తాండూర్‌లో అభివృద్ధి జోరు..కోట్ల రూపాయల పనులకు శ్రీకారం

తాండూర్ ఏప్రిల్ 13 (మనం న్యూస్): తాండూర్ మండలంలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి స్పష్టం చేశారు. సోమవారం రేచిని గ్రామపంచాయతీలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పంచాయతీ భవనాలు కేంద్రబిందువులుగా నిలుస్తాయని, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అనంతరం తాండూర్ మండల కేంద్రంలో రూ. 50 లక్షల వ్యయంతో నిర్మించిన ఆధునిక షాదీ ఖానా భవనాన్ని ప్రారంభించారు. సామాజిక కార్యక్రమాలకు తక్కువ ఖర్చుతో మంచి వేదికలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన 79 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 79,09,164 విలువైన కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాల ఆర్థిక భారాన్ని తగ్గించడంలో కళ్యాణ లక్ష్మి పథకం కీలకమని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమం చేరేలా కృషి చేస్తున్నామని అన్నారు. తరువాత తాండూర్‌లోని రాజీవ్ నగర్ గ్రామపంచాయతీకి రూ. 20 లక్షలతో నిర్మించనున్న నూతన భవనానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డ్ సభ్యులు, లబ్ధిదారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మెటపల్లి ప్రెస్ క్లబ్ సెక్రటరీ మహమ్మద్ అజీమ్, కాంగ్రెస్ నాయకుడు ఖుతుబోద్దీన్ పాషాను పరామర్శించిన నిత్యసాయి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రఘు



మెట్‌పల్లి ఏప్రిల్ 13 ( మనం న్యూస్ ) మెట్ పల్లి ప్రెస్ క్లబ్ సెక్రటరీ మహమ్మద్ అజీమ్, కాంగ్రెస్ పార్టీ మెట్ పల్లి పట్టణ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుతుబోద్దీన్ పాషా లను. సోమవారం నిత్య సాయి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రఘు పరామర్శించారు. గత రెండు రోజుల క్రితం అజీమ్ వాళ్ళ అమ్మ మరణించగా, వారి నివాసానికి వెళ్లి వారిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు, వారికి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ కష్ట సమయంలో ఆ కుటుంబానికి మనోధైర్యం కలగాలని వారు ఆకాంక్షించారు. ఆయన వెంట అల్లాడి ప్రవీణ్, నల్ల వెంకట్ తదితరులున్నారు.

## మల్యాల మండల బీజేపీ కార్యవర్గం ఎన్నిక



మల్యాల , ఏప్రిల్ 13 ,( మనం న్యూస్ ) : బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగిడి కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు మల్యాల మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.

**ముఖ్య నియామకాలు:**

ఉపాధ్యక్షులు: కోను శ్రీనివాస్, జి. గంగరాజు, ఓడ్నాల మారుతి, గడ్డం గంగయ్య. ప్రధాన కార్యదర్శులు: పొన్నం సాయి కుమార్, పిల్లి రాజశేఖర్. కోశాధికారి: పల్నాటి మల్లేశం. కార్యదర్శులు: కట్ట జ్యోతి, వి. లత, బి. రమ్య, కె. చంద్రశేఖర్. మోర్చా అధ్యక్షులుగా గౌతం కుమార్ ( బి జె వై ఎమ్ ), కటకం లత (మహిళా), కె. రమేష్ ( ఓ బి సి ), కె. లక్ష్మారెడ్డి (కిసాన్), ఎస్. లైటస్ ( ఎస్సీ ), సుల్తాన్ వెంకటేష్ ( ఎస్టి ) నియమితులయ్యారు. వీరితో పాటు 32 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం మాట్లాడుతూ. నూతన కార్యవర్గం సమన్వయంతో పనిచేస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

## క్యాతనపల్లి బిల్డర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



రామకృష్ణాపూర్, ఏప్రిల్ 13, (మనం న్యూస్) : క్యాతనపల్లి మున్సిపాలిటీ బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ బలోపేతం, నిర్మాణ రంగ అభివృద్ధి లక్ష్యంగా ఈ ఎన్నికలు నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడిగా భీమా మల్లేష్, అధ్యక్షుడిగా పనాస రాజు, జనరల్ సెక్రటరీగా అక్కల రమేష్, కోశాధికారిగా నల్లగోని కుమార్ గౌడ్, ముఖ్య సలహాదారుగా పెద్దూరి రాములు ఎన్నికయ్యారు. అనంతరం ఉపాధ్యక్షులుగా సురేందర్ గౌడ్, గుర్రం తిరుపతి, సెక్రటరీలుగా ఆడెపు విజయ్, సిరిమల్ల సుధాకర్, గట్టు నవీన్ కుమార్, బత్తుల శ్రీనివాస్ ఎంపికయ్యారు. అదేవిధంగా గౌరవ కార్యవర్గ సభ్యులుగా సకనవీటి శ్రీనివాస్, ముత్తె బానయ్య, ఆవుల జైపాల్ రెడ్డి, చిందం చంద్రకాంత్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ అసోసియేషన్ కార్యకలాపాలను విస్తరించి, బిల్డర్ల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## 6వ వార్డులో ఇందిరమ్మ గృహప్రవేశంలో పాల్గొని చీర పంచ అందజేసిన కౌన్సిలర్ శిరీష శేఖర్




కోరుట్ల,రూరల్ ఏప్రిల్ 13 (మనం న్యూస్) : యకీన్ పూర్ గ్రామం లో నూతనం గా నిర్మించిన ఇందిరమ్మ గృహ ప్రవేశానికి సంప్రదాయ పద్ధతిగా ఇందిరమ్మ లబ్ది దారులు ఐన బత్తుల నికిల్--రాజమణి లకు ప్రభుత్వ ఆదేశానుసారం 6వ వార్డు కౌన్సిలర్ శిరీష శేఖర్ చీర పంచె కానుకగా అందజేశారు. అనంతరం శిరీష శేఖర్ మాట్లాడుతూ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునేవారు త్వరగా పూర్తి చేసుకోవాలని ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని, ఇంకా ఖాళీ స్థలం ఉండి ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవాలని అనుకున్న వారు ఎవరైనా ఉంటే మన వార్డు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ ఉరుమడ్ల వెంకటి, గ్రామ కాంగ్రెస్ నాయకులు మ్యాదరి లక్ష్మణ్, ఇల్లెందుల శ్రీధర్, బన్న రాజేష్, బైర స్వప్నకర్, బద్ది సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటాపూర్‌లో రోడ్డు భద్రతపై అవగాహన సమావేశం




కోరుట్ల, ఏప్రిల్ 13 (మనం న్యూస్): ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం సందర్భంగా వెంకటాపూర్ గ్రామంలో సోమవారం గ్రామసభ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ద్యాగ గంగాధర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి రామకృష్ణ, పోలీసు ఉపాధికారి చిరంజీవి, రహదారి భవనాల శాఖ సహాయ ఇంజనీరు లక్ష్మీపతి లు పాల్గొన్నారు. ఎస్సై చిరంజీవి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రవాణా నియమాలను పాటించాల్సిన అవసరం గురించి గ్రామస్థులకు వివరించారు. అనంతరం సర్పంచ్ గంగాధర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల ఈ కార్యక్రమం గ్రామంలో పారిశుద్ధ్యంతో పాటు అన్ని కార్యక్రమాలు గ్రామాభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందని వివరించారు, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. రహదారి పక్కన విస్తరించి రవాణాకు అడ్డంకిగా మారిన చెట్ల కొమ్మలను తొలగించారు. అలాగే రహదారి వెంట ఉన్న గుంతలను గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో మొరం వేసి పూడ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పిట్టల రాజేశ్వరి వార్డ్ సభ్యులు, గ్రామ కార్యదర్శి నరేష్, నాయకులు పిట్టల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బర్కం నర్సయ్య, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బర్కం చిట్టిబాబు, వెంకటేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ కట్కం రాజేష్, బర్కం రాజేందర్, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లా పంచాయతీ అధికారికి స.హ కమిషనర్ నోటీసులు



కొడిమ్యాల. ఏప్రిల్ 13 (మనం న్యూస్) : జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలానికి చెందిన కొండూరి కొండయ్య కొడిమ్యాల గ్రామ పంచాయతీలో అక్రమ నిర్మాణం చేస్తున్న రాగి రఘునందన్ ఎలాంటి సెట్ బ్యాక్ చేయక పంచాయతీ చట్టం నియమ నిబంధనలు పాటించడం లేదని తగు చర్యలు తీసుకోవాలని కొడిమ్యాల గ్రామ పంచాయతీ ఈవో వంశీ వర్ధన్ కు పలుమార్లు ఫిర్యాదు చేసిన, పట్టించుకోలేదని అట్టి ఈవో పైన చర్యలు తీసుకోవాలని జగిత్యాల డిపిఓకు ఫిర్యాదు చేయడం జరిగింది.అట్టి ఫిర్యాదుకు ఎలాంటి జవాబు రాకపోవడం అట్టి దరఖాస్తుపైన ఏమి చర్యలు తీసుకున్నారు. అని డిపిఓ కు ఆర్.టి.ఐ దరఖాస్తు చేసినాను అట్టి దరఖాస్తుకు 45 రోజులు గడిచిన సమాచారం ఇవ్వకపోవడంతో సెక్షన్ 19(1) క్రింద అప్పీల్ చేసినాను,అట్టి దానికి కూడా సమాచారం ఇవ్వకపోవడంతో స.హ కమిషనర్ కు తేదీ 15/09/2025 రోజున ఫిర్యాదు చేసినట్లు కొండూరి కొండయ్య తెలిపారు.అట్టి ఫిర్యాదును పరిశీలించిన కమిషనర్ 15/04/2026 బుధవారం రోజున ఉదయం 10:20 గంటలకు స.హ కమీషనర్ కార్యాలయం హైదరాబాదులో పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆదేశిస్తూ జగిత్యాల జిల్లా పంచాయతీ అధికారికి నోటీసు జారీ అయినట్లు కొండూరి కొండయ్య నేడు పత్రికలకు తెలిపారు.

## సర్పంచ్ సింగతి రాణి-తిరుపతి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన

నెన్నెల్, ఏప్రిల్ 13 (మనం న్యూస్): మండలంలోని గుండ్లసోమారం గ్రామంలో 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమం గౌరవ సర్పంచ్ సింగతి రాణి--తిరుపతి గార్ల ఆధ్వర్యంలో జరిగింది.

ఈ సందర్భంగా సర్పంచ్ సింగతి రాణి--తిరుపతి గారు గ్రామ సభను ఉద్దేశించి మాట్లాడుతూ, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని, కార్ నడిపేటప్పుడు సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి అని సూచించారు. అలాగే వాహనాలను అతి వేగంగా నడపకూడదని, ఓవర్‌టేక్ చేయడాన్ని నివారించాలని, రోడ్డు దాటేటప్పుడు వచ్చే వాహనాలను గమనించి జాగ్రత్తగా రోడ్డు క్రాస్ చేయాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జాగతి వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి రంజిత్ సార్, అంగన్వాడీ టీచర్ సునీత, వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



## రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు




ఇల్లందకుంట, ఏప్రిల్ 13 (మనం న్యూస్): రహదారి భద్రతపై ఇల్లందకుంట పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించేలా ప్రజలను చైతన్యపరచడం, ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకునేలా ప్రజలకు వాహనదారులకు అవగాహన కల్పించారు. మోటార్ సైకిల్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపవద్దని, అతి వేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని గుర్తు చేశారు. ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు రహదారి నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపరాదని హెచ్చరించారు. కుటుంబ సభ్యుల కోసం, మన సురక్షిత జీవితం కోసం ట్రాఫిక్ నియమాలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## కోతుల దాడిలో వ్యక్తికి గాయాలు



చెన్నూరు ఏప్రిల్ 13 (మనం న్యూస్): చెన్నూరులో కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయి. సోమవారం చెన్నూర్ మున్సిపాలిటీ 7వ వార్డు కొత్తగూడెం కాలని చెందిన సల్పాలా కొండయ్య యాదవ్ ఇంటి ఆవరణలో తులసి మొక్కకు పూజ చేస్తుండగా కోతులు దాడి చేశాయి. ఒక్కసారిగా 20 నుంచి 30 కోతులు దూసుకొచ్చి దాడి చేయడంతో ఆయనకు పలు చోట్ల గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వెంటనే 7 వార్డు కౌన్సిలర్ కొప్పుల ప్రభాకర్ స్పందించి బాధితుడిని ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. గాయాలకు డ్రెస్సింగ్ చేసి అవసరమైన ఇంజెక్షన్లు ఇచ్చారు. కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంపులుగా తిరుగుతున్న కోతులు ఎప్పుడైనా దాడి చేసే పరిస్థితి నెలకొనడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఇళ్ల బయటకు రావడానికే భయపడుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్‌పర్సన్ తక్షణ చర్యలు తీసుకుని కోతులు, వీధి కుక్కలను పట్టించి ప్రజలకు భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. ఆలస్యం చేస్తే మరిన్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

## ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని

మల్యాల, ఏప్రిల్ 13,( మనం న్యూస్ ) : మల్యాల మండలంలో గుడిపేట గ్రామానికి చెందిన కుసుమ గణేష్ సంధ్యల కుమార్తె అనుపమ ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ విభాగంలో 1000కి 995 మార్కులు సాధించినందుకు గర్వంగా ఉంది.

సర్పంచ్ శ్వేతా అంజిరెడ్డి ఆధ్వర్యంలో, మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా గ్రామ ప్రజల సమక్షంలో సన్మానించారు . ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొట్టె అనిత నరేష్, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు మిర్తి శ్రీనివాస్, బండి రవి గౌడ్, కందరి ముత్యం రెడ్డి, సతీష్ మోహన్ రెడ్డి, శంకరయ్య, సుధాకర్, లక్ష్మీనారాయణ, సుజాత, పద్మ, స్రవంతి, సాత్విక వంటి ప్రముఖులు పాల్గొన్నారు.



## శ్రీపాదరావు వర్ధంతి..నివాళులు అర్పించిన కాంగ్రెస్ నేతలు



కరీంనగర్ రూరల్ ఏప్రిల్ 13 (మనం న్యూస్).. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాద రావు వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ డిసిసి కార్యాలయంతో పాటు నగరంలోని బస్టాండ్ కూడలి వద్ద శ్రీపాదరావు వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరై మాజీ ఎమ్మెల్యేలు కటకం మృత్యుంజయం, ఆరేపల్లి మోహన్, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ ఇతర ముఖ్య నేతలతో కలిసి శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. అనంతరం బస్టాండ్ కూడలి వద్ద కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నేతలు హాజరై శ్రీపాదరావు విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కటకం మృత్యుంజయం మాట్లాడుతూ..అజాతశత్రువు ప్రజలు మెచ్చిన నేత శ్రీపాద రావు వర్ధంతి సందర్భంగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, వారు శాసనసభ స్పీకర్ గా రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసిన నేతగా, ప్రజాప్రతినిధిగా మారుమూల గ్రామంతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎంతోమంది అభిమానులను సంపాదించుకొని రాజకీయాలలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న శ్రీపాదరావు స్వర్గస్తులవడం దురదృష్టకరం, వారు విలువలతో కూడిన రాజకీయాలు చేసి నేటి తరానికి ఆదర్శవంతులుగా ఆరోజు వారు చేసిన అభివృద్ధి వారు చూపిన బాటలో నడుస్తూ వారి తనయుడు గౌరవ మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు శ్రీపాద రావు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కన్న కలలను సహకారం చేయడమే లక్ష్యంగా వారి ఆశయ సాధన కోసం నిరంతరం శ్రమిస్తున్నారు, మేమంతా వారి అడుగుజాడల్లో నడుస్తూ కంకణ బద్ధులమై పనిచేస్తామని శ్రీపాద రావు ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిన బూనుచున్నాము అని, ఈ సందర్భంగా ఆ మహనీయుని సేవలను స్మరించుకుంటూ కరీంనగర్ పట్టణంలో పేదల కోసం అన్నదానం కార్యక్రమాన్ని చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమాలలో నాయకులు ,మల్లికార్జున రాజేందర్, ఎండి తాజ్, కర్ర రాజశేఖర్, బానోతు శ్రావణ్ నాయక్, వరాల నరసింగం, పడుశెట్టి భూమయ్య, వేల్పుల వెంకటేష్, ఆకుల నరసయ్య, గుమ్మడి రాజకుమార్, పర్వత మల్లేశం, చాడ గొండ బుచ్చి రెడ్డి, సరిల్లా ప్రసాద్,కామ్రెడ్డి రాంరెడ్డి, చర్ల పద్మ, మునిగంటి అనిల్ నిహాలైమ్మద్, వంగల విద్యాసాగర్, సుధాకర్ నాయక్, కుంభాల రాజకుమార్, దిండిగాల మధు, వెన్న రాజ మల్లయ్య, బాకారపు శివయ్య, మూల జైపాల్, కల్వల రామచందర్, రాచకొండ ప్రభాకర్, రాచర్ల పద్మ, అస్తపురం రమేష్, కామ్ పెల్లి కీర్తి కుమార్, సుదర్శన్, పిట్టల రవి, గంగుల దిలీప్, లైక్, జొన్నల రమేష్, రూపు రెడ్డి శ్రీనివాసరెడ్డి, తోట అంజన్న, హర్ష మల్లేశం, దండి రవీందర్,పడాల అజయ్, వీరదేవేందర్, కమ్రుద్దీన్ అబ్దుల్ బారి, సుకూర్, షబానా, నాగుల సతీష్, జ్యోతి రెడ్డి,ఖాజా ఖాన్,కిరణ్, మామిడి సత్యనారాయణ రెడ్డి, శిల్ప, స్వప్నశ్రీ,సద్దాం, ఊరడి లత, ఇమ్రాన్, అనిల్, బత్తిని చంద్రయ్య గౌడ్, ఏజ్రా, జీడి రమేష్, చాంద్,మంద మహేష్, సుంకర గణపతి, మాసూమ్ ఖాన్ సిరాజ్ , వాసు, ఊకంటి రవీందర్ రెడ్డి, అష్రాఫ్ ,తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి




బెల్లంపల్లి, ఏప్రిల్ 13,(మనం న్యూస్) : రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సమగ్ర చర్యలు తీసుకోవడం అత్యంత అవసరమని, ప్రతి పౌరుడు బాధ్యతతో ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారానే ప్రమాదాలను తగ్గించవచ్చని బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ గ తెలిపారు. అరైవ్ అలైవ్ -2026 కార్యక్రమాన్ని భాగంగా చేసుకుని ఈ నెల 13 నుండి 18 వరకు పట్టణ వ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, తనిఖీలు, ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అన్ని శాఖల సమన్వయం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల భాగస్వామ్యం కీలకమని అన్నారు.ప్రతి సంవత్సరం నిర్లక్ష్య డ్రైవింగ్, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనల వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని నివారించేందుకు హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ, అప్రమత్తత వంటి అంశాలను తప్పనిసరిగా పాటించాలని సీఐ గారు సూచించారు. బాధ్యతాయుతమైన డ్రైవింగ్ ద్వారా మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా రక్షించవచ్చని తెలిపారు.డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్, రాంగ్ రూట్, సిగ్నల్ జంపింగ్, ఓవర్ లోడింగ్ వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

**కార్యక్రమాల వివరాలు.**

మొదటిరోజు (13వ తేదీ, సోమవారం): పట్టణం లో అన్ని వార్డులలో కమిటీలను ఏర్పాటు చేసి ప్రజలు, యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం.

1 రోజు కార్యక్రమంలో భాగంగా 9 మంది సభ్యులతో కూడిన ఒక రోడ్డు భద్రతకు సంబంధించి వార్డు కమిటీని నిర్మశించడం జరిగింది.

ఈ కమిటీలో వార్డు కౌన్సిలర్,ఒక పోలీస్ ఆఫీసర్,వార్డ్ ఆఫీసరు, ఒక డాక్టర్,ఆశా వర్కర్, అంగన్వాడి సిబ్బంది, రిటైర్డ్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగి,ముగ్గురు మహిళలో మరియు చురుకుగా ఉన్న యువతతో మొత్తం తొమ్మిది మందితో ఈ యొక్క కమిటీని నిర్మానించారు. 2 రోజు (14వ తేదీ, మంగళవారం): అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహాల వద్ద రోడ్డు భద్రత ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించడం. అలాగే బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి సంబంధిత శాఖలతో కలిసి మరమ్మత్తు చర్యలు చేపట్టడం.

3రోజు (15వ తేదీ, బుధవారం): పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు, బస్సు డ్రైవర్లకు ప్రత్యేక సదస్సులు నిర్వహించడం. 4రోజు (16వ తేదీ, గురువారం): ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, వారి లైసెన్సులు, యూనిఫామ్ తదితర అంశాలపై తనిఖీలు చేపట్టడం. 5రోజు (17వ తేదీ, శుక్రవారం): ప్రమాద స్థలంలో ఇవ్వాల్సిన ప్రథమ చికిత్స, స్పందించే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించడం.

6 రోజు (18వ తేదీ, శనివారం): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానాలు విధించడం, వారికి అవగాహన కల్పించడం.పట్టణ వ్యాప్తంగా ఆరు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాలకు ప్రజలు, యువత, వాహనదారులు సహకరించి విజయవంతం చేయాలని బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ శ్రీ కె శ్రీనివాసరావు కోరారు.

## గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం

**- విచారణ చేపట్టాలని ప్రజా వాణిలో పిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు**



భీమారం ఏప్రిల్ 13(మనం న్యూస్ )మండలములోని,, భీమారం గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం పై మంచిర్యాల జిల్లా పాలనధికారి సమికృత భవనములో, నిర్వహించిన ప్రజా వాణిలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తైనేని. రవి, సందనవేణి. అజయ్ లు అడిషనల్ కలెక్టర్ కి వ్రాత పూర్వక ఆధారాలతో, పిర్యాదు చేశారు. భీమారం గ్రామ సర్పంచ్ ఉస్మామల్ల.విజయలక్ష్మి,ఉప సర్పంచ్ కోలా.సత్తమ్మ, గ్రామ పంచాయితి కార్యదర్శి పెద్దనపల్లి. మల్లేష్‌లు గడిచిన (3) మూడు నెలల్లో సానిటేషన్, త్రాగు నీరు పేర్లతో గ్రామపంచాయితికి చెందిన సుమారు రూ.23,28,674/- రూపాయలను సర్పంచ్ తన భర్త ఉస్మమల్ల.పున్నంచంద్, బావ ఉస్మమల్ల శ్రీనివాస్,లు మల్టీ పర్పస్ వర్కర్ల అకౌంట్లలోకి బదిలీ చేయడంతో,అట్టి నిధులను దుర్వినియోగం అయినవని గ్రామ సభలోప్రజలు అడిగితే సర్పంచ్,ఉప సర్పంచ్,పంచాయితీ కార్యదర్శులు సమాధానం చెప్పకుండా దాట వేశారు. ఈ విషయం పై సత్వరమే పూర్తి స్థాయిలోవిచారణ జరిపించి బాధ్యులపై చట్ట పరమైన చర్యలు తీసుకోగలరని,అలాగే భీమారం గ్రామ పంచాయితి నిధులను సర్పంచ్,ఉ ప సర్పంచ్,పంచాయితి కార్యదర్శిలు దుర్వినియోగం. సర్పంచ్ పంచాయతీ నిధులలో నుండి రూ.2,90,650/- రూపాయలను తన భర్త యగు ఉస్మమల్ల. పున్నంచంద్ ఖాతా లోకి, రూ.4,89,600/- రూపాయలను తన బావ అయిన ఉ స్మమల్ల. శ్రీనివాస్ ఖాతా లోకి,రూ.2,70,150/- రూపాయలు గ్రామ పంచాయితి మల్టీ వర్కర్ గోస్కుల. భరత్ యొక్క భార్య యగు గోస్కుల.సహజఖాతా లోకి, రూ.2,72,922/- లు ఆనపురం.సుకన్య ఖాతా లోకి, రూ. 1,50,000/- రూపాయలను భీమారం గ్రామంలోగ్రామ పంచాయతీకి ఎలాంటి సంబంధం లేని,సామాను లేని దుకాణం యజమాని అయిన పోగుల.మల్లేష్ (రిపోర్టర్) ఖాతా లోకి, రూ.4,42,052/- రూపాయలు ఓ ఎంటర్ ప్రైజెస్ పేరు మీద గల ఖాతా లోకి, రూ.2,54,100/- రూపాయలు సుధారాణి ఎంటర్ ప్రైజెస్ ఖాతా లోకి, రూ.69,200/- లు గోడిసెల. రాజయ్య ఖాతా లోకి, రూ.90,000/- రూపాయలను సూర్య ప్రకాశ్ ఖాతా లోకి బాదలయింపు చేసుకొని వాటిని డ్రా చేసి దుర్వినియోగం చేసినారు. ఈ విధంగా మొత్తం రూ.23,28,674/- రూపాయలు దుర్వినియోగం అయినట్టు.గ్రామ సభలో ఈ మూడు నెలల్లో ఇంత డబ్బు ఏ విదంగా ఖర్చు అయినవి అని వీరిని ప్రజలు నిలదీయగా,మా ఇష్టం, మీకు చెప్పాల్సిన అవసరం లేదని విషయాన్ని దాటవేసినారు. కావున ప్రజా ధనాన్ని ఈ విధంగా వివిధ ఖాతాలలోకి మళ్ళించి, డ్రా చేసి దుర్వినియోగం చేసినందున దీనిపై సత్వరమే పూర్తి స్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై చట్ట పరమైన చర్యలు తీసుకొని వీరిని ఆయా పదవుల నుండి తొలగించగలరని,నిధుల దుర్వినియోగానికి సంబంధించిన ఆధారలన్నింటిని జత పరచి, ప్రజావాణిలో సమర్పించడం జరిగింది.చున్నాము.ఈ యొక్క పిర్యాదు గ్రామ ప్రజల పక్షాన, యువకుల పక్షాన అడిషనల్ కలెక్టర్ కి అందిచడం జరిగింది. తైనేని రవి, అజయ్, పూసాల. రమేష్ లు ఉన్నారు.

## చెన్నూరులో పేకాట గుట్టురట్టు

చెన్నూరు ఏప్రిల్ 13 (మనం న్యూస్): చెన్నూర్ పట్టణంలోని చాకలి బజార్‌లో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేసి 9 మందిని అరెస్ట్ చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు సోమవారం సీఐ బన్సీలాల్, ఎస్సైలు శ్యామ్ పటేల్, సుబ్బారావు సిబ్బందితో కలిసి రైడ్ నిర్వహించారు. రైడ్ లో అయిటిపాముల ప్రశాంత్, పెదకొండ నరేష్, ముత్తన్నపల్లి సాగర్, పెదకొండ మహేష్, ఐటీపాముల శంకర్, అద్దురి ప్రేమ్‌కుమార్, చిప్పకుర్తి రమేష్, తగరం సంతోష్, ఎండీ నిజాముద్దీన్‌ను అదుపులోకి తీసుకోగా, తగరం మహేందర్ పరారయ్యాడు. వారి వద్ద నుంచి రూ.9,500 నగదు, 6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న వ్యక్తితో కలిపి 10 మందిపై కేసు నమోదు చేసి, 9 మందిని అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న వ్యక్తిని త్వరలో పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. పేకాట నిర్వహించినా, ఆడినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ బన్సీలాల్ హెచ్చరించారు. రెండుసార్లు పట్టుబడిన వారిపై రౌడీ షీట్ తెరవనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.



# ప్రాణహిత తీరాన 'అరైవ్ అలైవ్' నినాదం

## రోడ్డు భద్రతపై గ్రామాల్లో చైతన్య కెరటం

**-రక్తసిక్తమవుతున్న రహదారులు స్పందించిన పోలీసులు**

**-కోటపల్లి గ్రామాల్లో భద్రతా కమిటీల ఏర్పాటు**

**-రోడ్డు ప్రమాదాలపై పోలీసుల భావోద్వేగ చైతన్యం**

**-చెన్నూర్ రూరల్ సీఐ, కోటపల్లి ఎస్ఐల పిలుపు**

**-మైనర్ల చేతికి స్టీరింగ్ వద్దు, సభల్లో భద్రత ప్రతిజ్ఞ**

**-బాధ్యతగా ట్రాఫిక్ నిబంధనల అమలు**





కోటపల్లి ఏప్రిల్ 13 (మనం న్యూస్): రహదారి నిబంధనల పట్ల నిర్లక్ష్యం ప్రాణాంతకంగా మారుతున్న తరుణంలో, ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమం కోటపల్లి మండలంలో సోమవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. పారుపల్లి, రాంపూర్ గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలు రోడ్డు భద్రతపై ఒక కొత్త చైతన్యాన్ని రగిలించాయి. కేవలం జరిమానాల భయంతో కాకుండా, ప్రాణాల పట్ల బాధ్యతతో వాహనాలు నడపాలన్న సందేశం ఈ వేదికల ద్వారా బలంగా వినిపించింది.

### వారోత్సవాల వేళ.. భద్రతపై అడుగులు

ఈ నెల 13 నుంచి 18 వరకు సాగనున్న రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా, పోలీసులు, అధికార యంత్రాంగం నేరుగా క్షేత్రస్థాయిలోకి వెళ్లారు. సోమవారం పారుపల్లి, రాంపూర్ గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో చెన్నూర్ రూరల్ సీఐ ఆర్. కృష్ణ, ఎస్సై రాజశేఖర్, ఎంపిడిఓ నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రత్యేకంగా రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేసి, సభ్యులతో చైతన్య ప్రతిజ్ఞ చేయించడం విశేషం.

### కన్నీటి గాథలు పునరావృతం కావొద్దు.

సభను ఉద్దేశించి సీఐ ఆర్.కృష్ణ మాట్లాడుతూ, అత్యంత భావోద్వేగంగా స్పందించారు. రోడ్డు ప్రమాదంలో ఒక ఇంటి పెద్దను కోల్పోతే, ఆ కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా వీధిన పడుతుంది. పిల్లల భవిష్యత్తు అంధకారమవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరి నిర్లక్ష్యం, అతివేగం లేదా మద్యం మత్తు, పచ్చని కుటుంబాల్లో చిచ్చు పెడుతున్నాయని, యువత ప్రాణాల మీదకు తెచ్చుకోవడం దేశానికే నష్టమని హెచ్చరించారు.

### కమిటీల పర్యవేక్షణ, నియమ నిబంధనలు.

గ్రామాల్లో ఏర్పాటు చేసిన కమిటీలకు సీఐ కీలక సూచనలు చేశారు. చిన్నారుల చేతికి వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులను నియంత్రించాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించేలా చూడాలన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామస్తులందరితో కలిసి అధికారులు రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని, హెల్మెట్ లేకుండా వాహనం నడపమని, ఇతరుల ప్రాణాలకు ముప్పు తలపెట్టమని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ట్రాఫిక్ రూల్స్ పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలి

**- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**



కరీంనగర్ ఏప్రిల్ 13(మనం బ్యూరో)...ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్ - అలైవ్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలనీ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో 99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తోన్న అరైవ్ - అలైవ్ రోడ్డు భద్రత వారోత్సవాల వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ప్రతి ఒక్కరు సహకరించాలని పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, మద్యం తాగి వాహనాలు నడప వద్దన్నారు. మొబైల్ ఫోన్ వినియోగం వంటి అలవాట్లు ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి అని సూచించారు. టూ వీలర్ వాహనదారులు ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం తాగి వాహనాలు నడపవద్దని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. పాదచారులు కూడా జాగ్రత్తగా రోడ్లు దాటాలని, నిర్దేశిత జీబ్రా క్రాసింగ్‌లను వినియోగించాలని చెప్పారు. ప్రజల సహకారంతోనే ప్రమాదాలను తగ్గించవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నడుచుకోవాలని సూచించారు. స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఈనెల 16వ తేదీన సుభాష్ నగర్ లోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కాలేజీలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో విద్యాసంస్థల బస్సు డ్రైవర్లు ఆటో రిక్షా డ్రైవర్లకు మెడికల్ చెకప్ నిర్వహిస్తారని తెలిపారు. అదేవిధంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు డ్రైవర్లకు రోడ్ సేఫ్టీ పై అవగాహన కల్పిస్తారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ పురుషోత్తం, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి ఎంవీఐ రవికుమార్ రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ మెంబర్, ఎన్జీవో నీలం సంపత్ పాల్గొన్నారు.